సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

198/199

ఏప్రిల్/మే

1992

ఈస్టిండియా కంపెనీ/ఐ ఎం ఎఫ్

బహదూర్‌షా/పి వి నరసింహారావు

'ముద్రారాక్షస'

తులనాత్మక పరిశీలన

చైనా కథ

బాల గెరిల్లా

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

198-199 మాసపత్రిక ఏప్రిల్ /మే 1992

ఈ సంచికలో

నిర్వహణ
సాహితీమిత్రులు

ఈ సంచిక రు. 5 సంవత్సర చందా రు. [illegible]

Edited Printed and Published by P. Hemalatha, Flat 3,
Floor 2, Lakshmi Apartments, Nalgonda X Roads,
Malakpet, Hyderabad-500 036
and Printed at Nagendra Press, Vijayawada-520 002
Working Editor : Vara Vara Rao

'పార్లమెంట్ భవన్‌ను ఫోర్డు కంపెనీకి ఎప్పుడు అమ్ముతున్నారు?'

ప్రధాని పి. వి. నరసింహారావు పేర సాహిత్యవేత్త 'ముద్రారాక్షస' బహిరంగ లేఖ

శ్రీ పి. వి. నరసింహారావు
ప్రధానమంత్రి, భారత ప్రభుత్వము, న్యూఢిల్లీ
గారి సేవలో....

ప్రియమైన శ్రీ రావుగారూ,

నేనిపుడు రాస్తున్న లేఖ వంటివి సాధారణంగా సాహిత్యవేత్తలు రాజకీయ నాయకులకు రాయరు. అందుకని మీకు ఆశ్చర్యం కలగవచ్చు. జవాబు వస్తుం దన్న నమ్మకం కూడా లేదు. అందువల్ల ఈ ఉత్తరాన్ని అచ్చు వేయిస్తున్నాను కూడ.

గడచిన కొద్ది రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచే పేరుతో మీరు చేసిన పనులన్నీ బాధాకరమైనవే. మీరు ఇది ఒప్పుకోరు. మీరే విదేశీ ఒత్తిడుల వల్ల ఈ పనులన్నీ చేస్తున్నారో వాళ్ళు తమ సలహాల మీద మీరు చేస్తున్న పనులే సరియైనవని కూడ మీకు చెప్తారు.

ఒకానొక కాలంలో ఢిల్లీ పాదుషాలు ఈస్టిండియా కంపెనీకి దీవానిని కుదువపెట్టి కంపెనీ సర్కారు ఇచ్చే పింఛనుతో సంతుష్టిపడేవారు. మీరు పింఛను ప్రస్తావన కూడ లేకుండా ప్రభుత్వాన్ని కుదువపెట్టారు. ఏ రోజయినా ఇంగ్లీషు ప్రభువులు రావచ్చు; మీ మహాఘనత వహించిన రాజ్యంలో అవకతవకలు పెచ్చు పెరిగాయి. కంపెనీ సర్కారు మిమ్మల్ని సగౌరవంగా రంగూన్ పంపించే నిర్ణయం తీసుకుంది– అని చెప్పడం మాత్రమే మిగిలింది.

మీరు కూడ కొన్ని భూభాగాల్ని, ఆస్తుల్ని కుదువపెట్టారు. వాహ్ ! పార్లమెంట్ భవన్‌ను ఫోర్డ్ సాహెబ్‌కు ఎపుడమ్ముతున్నారని అడగాలని మనసు తహతహలాడుతున్నది. రాష్ట్రపతి భవన్‌ను ఖాళీ చేయించండి సాబ్. లీజుకు ఇవ్వండి. అక్కడొక బహుళ జాతీయ కంపెనీ హోటల్ పెట్టవచ్చు. మరి రాష్ట్రపతి, లోక్

సభ, రాజ్యసభ అధ్యక్షులు ఏం కావాలి అని నన్నడగకండి. పార్లమెంటు సభ్యులు ఎక్కడ కూర్చుంటారని అసలే అడగవద్దు.

మొదటి విషయమేమిటంటే దీనికి జవాబు స్వయంగా ఐ. ఎం. ఎఫ్. చెప్తుంది. వాళ్ళేమీ చెప్పలేదంటే ఈ కుర్చీల అవసరం అంతగా మిగలలేదని అర్థం. మీరు అదనాన్ ఖగోశితో మాట్లాడి చూడండి. మన రాష్ట్రపతిమీద ప్రతి సంవత్సరం కోటిన్నర, రెండు కోట్ల రూపాయల ఖర్చవుతున్నది. ఖగోశి ఈ కుర్చీని లీజుమీద తీసుకొని కోటిన్నర - రెండు కోట్ల (రూపాయలేమిచ్చె - అను) దీనారాలే ప్రతి సంవత్సరం సులభంగా ఇవ్వగలడు.

ఎవ్వరూ తీసుకోకపోతే కరీంలాలాతో మాట్లాడండి. మీరీ పార్లమెంటుతో చేయిస్తున్న పనులు ఆయనయితే ఇంకా పెద్ద మొత్తాలు చెల్లించి చేయగలడు.

మీకు గోయివుందో లేవో తెలియదు. భారతదేశంలో నూటయాభై సంవత్సరాల తర్వాత పునరావృతమవుతున్న విషయాల గురించి మీ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. నూటాయేభై సంవత్సరాల తర్వాత పునరావృతమవుతున్న పను లేమిటో జ్ఞాపకంకూడ చేయనా.

1840 ప్రాంతాల్లో భారతదేశంలో నూతన సాంకేతిక పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని ఈస్టిండియా కంపెనీ చెప్పింది. సరిగ్గా యిప్పుడు ప్రపంచ బ్యాంకు, ఐ. ఎం. ఎఫ్. చెప్తున్న రీతిలోనే.

ఆశ్చర్యపోవద్దు మిత్రమా, భారతదేశంలో నూలు ఉత్పత్తి కోసం నూతన సాంకేతిక పరిశ్రమల ఏర్పాటు ఈస్టిండియా కంపెనీ అమెరికాతోనే చేయించింది.

ఈ సంఘటనకన్నా కొన్ని దశాబ్దాల ముందు ఈస్టిండియా కంపెనీ భారత దేశంలో 'స్వేచ్ఛా వ్యాపారం' కోసం నినాదమిచ్చింది. ఐ ఎం. ఎఫ్. కూడ ఇదే నినాదమిస్తున్నది. మీరు దానిని ప్రతిధ్వనిస్తున్నారు.

కాని మిత్రమా 1840 లో కూడ సాధ్యంకాని పని మీరొకటి చేస్తున్నారు.

1840 లో అమెరికా సాంకేతిక నిపుణులు భారతదేశానికి వచ్చారు. వాళ్ళు కొన్ని ప్రాథమిక పరిశీలనలు చేసిన తర్వాత కంపెనీ బహుమార్లతో భారతదేశంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం లాభాలు ఆర్జించజాలదన్నారు. అమెరికాలోనైనా, బ్రెజిల్‌లోనైనా పనిచేయడానికి బానిసలు వున్నారు గనుక అక్కడ నూతన టెక్నాలజీ లాభాలు ఆర్జించి పెట్టిందన్నారు.

కొంచెం ధ్యాసపెట్టి ఆలోచించు మిత్రమా, నూతన సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన ఆ కాలంలో దాని సాఫల్యానికి బానిసలు అవసరమయ్యారు.

నూతన ఆర్థిక విధానంతోపాటు పారిశ్రామిక విధానం కూడ మార్చాల్సిన అవసరం వుందని మీరు అంగీకరించడంలోనే- ఈ అంశానికి పోలిక దొరకడం సులభమవుతుంది.

1840 ప్రయోగం తర్వాత బ్రిటిష్ ప్రభువులు నేర్చుకున్న నీతి ఫలితంగా వాళ్ళు వెళ్ళిపోయే సమయానికి భారతదేశంలో భూమిలేని కూలీలు దాదాపు ఇరవైఐదు లక్షలయ్యారు. అర్థ శతాబ్దంలో వీళ్ళు ఏభై రెట్లు పెరిగారు. ఇంగ్లీషు వాళ్ళ ప్రయోజనం నెరవేరింది. బానిసలు కాకపోతే బానిసలవంటి స్థితిలో పని చేసే కార్మికులు వాళ్ళకు దొరికారు.

ఇంగ్లీషు ప్రభువుల ఆ అవసరాన్నే మీరు మరొకమారు నెరవేర్చబోతున్నారు. బంధూ, ఈ క్రమంలో ఇంకో మాట అడగనా - నూరు రోజుల్లో ధరలు తగ్గిస్తాం అని జాతీయ బాకాలు కొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత మీరు ఇప్పుడు "గరీబీ హటావో" నినాదాన్ని పెదవులపై పలికినట్టు కూడ నేను వినలేదు, పేదరికాన్ని తొలగించడం కూడ మీ కిప్పుడు అప్రస్తుత ప్రసంగమైపోయింది. ఎందుకంటే -

ఇంకొక చేదుమాట చెవిన పెట్టండి. 'పావుశేరు గోధుమలు" అని ప్రేంచంద్ కథ ఒకటి వున్నది. భారతీయ ఆర్థిక చరిత్ర తెలిసినవాళ్ళకు ఈ కథ కల్పన కాదని తెలుసు. పావుశేరు గోధుమలు ఉద్దెరకు తెచ్చుకొని రైతు వడ్డీ వ్యాపారికి ఐదున్నర మణుగుల ధాన్యం అప్పు తేల్తాడు. అరవై అయిదు రూపాయలు చెల్లించిన తర్వాత కూడ అప్పుతీరక ఇరవై ఏళ్ళు వెట్టిచేసి జీతగాడుగానే మరణిస్తాడు.

ఐ. ఎం. ఎఫ్. ముందు మీరీ దేశాన్ని సరిగ్గా ఈ మృత్యుముఖంలోకి నెట్టడానికే ఏర్పాట్లు చేస్తున్నారు. విదేశీ అప్పులు తీర్చడానికి మరింత ఎక్కువ విదేశీ అప్పుల సంప్రదాయాన్ని మీరు ప్రారంభించిన తీరు 'పావుశేరు గోధుమలు' కథలో శంకర్‌కు పట్టిన గతివైపు మమ్మల్ని నెట్టుతున్నది.

నాకు కొన్ని భయానక ఘట్టాలు కళ్ళముందు ఆడుతున్నాయి. రావు సాహెబ్ గత శతాబ్దంలో రైతులకు, వృత్తిపనుల వాళ్ళకు గడ్డురోజులు వచ్చినపుడు ఇంగ్లీషువాళ్ళు భారతదేశంలో నూలుమిల్లులు పెట్టారు.

గత సంవత్సరాంతంలో మీరు కూడ నూలు దిగుమతి చేసుకున్నారు. గత శతాబ్దం అదే రోజుల్లో భారతదేశానికి ఇంగ్లీషువాళ్ళు గోధుమలు దిగుమతి చేసారు. మీరూ చేసుకున్నారు. ఇది పూర్తిగా అవసరమే కావచ్చు. ఆర్థిక, రాజకీయ దృష్టి కోణం నుంచి చాల మామూలు విషయం కూడ కావచ్చు. కాని ఇది ఒక భయానక రూపంలో ప్రమాద సంకేతాలను చూపుతున్నది.

భారతదేశంలోకి విదేశీ వస్త్రాలు రావడం దాని వెనుకవున్న దురుద్దేశాలంత చెడ్డ విషయం కాదు. 1815 వరకు వస్త్రాలను ఎగుమతి చేస్తున్న భారతదేశం ఆ తర్వాత భారీ ఎత్తున దిగుమతి చేసుకోవడం ప్రారంభమైంది. ఇది ఎట్లా జరిగిందో మీరు చరిత్రలో చూసుకోవచ్చు. సరిగ్గా దానికి సమాంతరంగా ఈ దేశంలో మళ్ళీ ఒక పెద్ద దుర్ఘటన జరుగబోతున్నది.

మీ తర్కం విచిత్రంగా వున్నది: ప్రభుత్వ పరిశ్రమలు భారీ నష్టాలు చూపు తున్నాయి. కనుక విదేశీ హస్తాల్లో పెడదాం. మీ పార్టీ చాల దశాబ్దాలుగా భాయిలా పడిన స్థితిలోనే ప్రభుత్వాన్ని నడుపుతున్నది. మరి మీరు ఇదే తర్కంతో ప్రభు త్వాన్ని కూడ విదేశీ హస్తాల్లో పెడుతున్నారేమో తెలియదు.

మీరు అధికారంలోకి రాగానే రూపాయి విలువ తగ్గించినపుడే మేం ఈ విష యాన్ని అర్థంచేసుకొని వుండాల్సింది.

పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశంలో ఇంగ్లీషువాళ్ళు చేసిన మొదటి పని భారతదేశ పైసలను పౌండుతో ముడిపెట్టి వెలకట్టడం. ఆ రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో చెలామణిలో వున్న వేరు వేరు నాణేల విలువను 'శ్రాఫ్' అనే పేరు గల వ్యాపారి నిర్ణయించేవాడు. ఇంగ్లీషు వాళ్ళు అతని అవసరం లేకుండా చేసారు. ఆ తర్వాత ప్రతి దేశపు డబ్బు విలువను ఇంగ్లీషువాళ్ళే నిర్ణయించడం మొదలు పెట్టారు.

ఐ. ఎం. ఎఫ్ అందుకు ఏమైనా భిన్నంగా చేస్తున్నదా ? మిత్రమా, మీరు చేరుకున్న చోటు అది గోర్బచేవ్ ఖాళీ చేసింది. ఇంక అక్కడినుంచి ఎవరూ వెనక్కి తిరిగిరారు. మీరుకూడ తిరిగిరారు. మీకయితే ఇపుడే దేశంలో ఇంక పత్రికలు, టి.వి. కార్యక్రమాలు కూడ విదేశీయమైనవే కావాలి.

నేను చంపారన్ గాంధీని కాజాలను. నీలిమందు దొరలను ప్రతిఘటిస్తూ 'నీల్ దర్పణ్' నాటకమాడిన వీరాంగన వినోదినిదయ్యే శక్తి కూడ నాలో లేదు.

విప్లవకారుడు, చిత్రకారుడు కామ్రేడ్ శంకర్‌కు జోహార్లు

సా. మి.

దిల్‌సుఖ్ నగర్ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో, హైదరాబాదు నగరంలో పోలీసులు చెరిపివేయకుండా పదేళ్ళ కిందటి పదునైన అక్షరాలు ఎక్కడయినా కనిపిస్తే చూడండి- రాడికల్స్ నినాదాలు. కరీంనగర్‌లో 1983లో రైతు కూలీ సంఘం సభలు, హైదరాబాదులో 1985 అఖిలభారత విప్లవ విద్యార్థి సమాఖ్య సభలు, 1990 ఫిబ్రవరిలో జననాట్యమండలి 18వ వార్షికోత్సవం, మే నెలలో వరంగల్‌లో రైతు కూలీ సంఘం సభలు- వీటికి సంబంధించి అందమైన అక్షరాలు శక్తివంతమైన నినాదాలు ఎక్కడయినా కనిపిస్తే కన్నార్పకుండా చూడండి. వాటిల్లో కామ్రేడ్ శంకర్ చెరిగిపోని చిరునవ్వు కనిపిస్తుంది. చెదరిపోని ఆత్మ స్థైర్యం కనిపిస్తుంది.

ఎనభైలలో క్యాంపస్‌లో చదివిన విద్యార్థులకు కామ్రేడ్ శంకర్ గురించి పై పరిచయం చాల లాంఛనంగా వుంటుంది. పదేళ్ళ క్రితమే కష్టజీవులను కడుపున పెట్టుకోవడానికి కోరలనోరు తెరచిన సామ్రాజ్యవాద రాక్షసిని చిత్రించి ఆయన ఉస్మానియా ఆర్ట్స్ కాలేజి ముందు ప్రదర్శించాడు. 1985కి పూర్వం కామ్రేడ్ శంకర్ తుపాకి అయినా గురి తప్పిందేమోకానీ, తూలిక గురి తప్పలేదు.

దిల్‌సుఖ్‌నగర్ హాస్టల్ విద్యార్థులను విప్లవ రాజకీయాలతో కూడగట్టాడు. పరిసర పారిశ్రామిక వాడల్లో కార్మికులను కూడగట్టాడు. విద్యార్థి కార్మిక కళాకారుల త్రివేణీ సంగమం శంకర్. వరంగల్ జిల్లా కేసముద్రంలో పుట్టి

కాని ఒక కేక వేసే ప్రయత్నం మాత్రం తప్పక చేస్తాను. అది మీ చెవులలో ఇటు నుంచి దూరి అటునుంచి వెళ్ళిపోవచ్చుగానీ దేశ ప్రజల దగ్గరికి చేరుతుందని మాత్రం ఆశిస్తాను.

పరిస్థితులు నన్ను మీకు శుభాకాంక్షలు చెప్పే మనస్థితి లేకుండా చేసాయి. అందుకని అంతే.

మీ

ముద్రారాక్షస్

('సమకాలీన్ తీస్‌రేదునియా' జనవరి-మార్చ్'92 సంచిక సౌజన్యంతో) 27-1-92

హైస్కూల్ చదువు తర్వాత హైదరాబాదుకు వచ్చి విద్యార్థి ఉద్యమంలో సంలీన మయ్యాడు.

1986లోనే టాడా చట్టం కింద హైదరాబాదులో అరెస్టయిన విద్యార్థుల్లో కామ్రేడ్ శంకర్ బహుశా మొదటివాడు. దీర్ఘకాలం జైల్లో వుండి విడుదలయ్యాక కొన్ని రోజులు కేసముద్రంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేసాడు.

ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేసాడు.

విలేఖర్లలో కూడ విప్లవకారులుంటారని పోలీసులకు తెలుసుగదా. 'ఎన్‌కౌంటర్' చేయాలనుకున్నారు. కామ్రేడ్ శంకర్ మళ్ళీ రహస్య జీవితానికి వెళ్ళిపోయాడు. రంగారెడ్డి జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన దళ నాయకుడు కామ్రేడ్ గంగన్న పరిచయమున్న ప్రతి ఒక్కరి హృదయంలో హత్తుకుపోయిన విప్లవ మనస్వి. విప్లవమొక ఆర్ట్‌గా, ఆచరణగా అభ్యసించిన, అలవోకగా జీవించిన అరుదైన వ్యక్తి.

కరీంనగర్ రైతుకూలీ సంఘం సభలు మొదలుకొని వరంగల్ రైతుకూలీ సంఘం సభలవరకు ఆయన వేసిన చిత్రాలు విప్లవ కళ ఎలా వుండాలో నేర్పే పాఠశాలలు. కళాభవన్‌లో గానీ మాక్స్‌ముల్లర్ భవన్‌లో గానీ ఆయన చిత్ర ప్రదర్శన ఎప్పుడూ ఏర్పాటు చేయాలనుకోలేదు. ఏ పత్రికకూ బొమ్మలు అమ్మా లనుకోలేదు. ఆయన సహచరులయిన ఆర్టిస్ట్ కామ్రేడ్స్‌తో కలసి మూడు 'ఆర్ట్ ఎగ్జిబిషన్'లు నిర్వహించాడు. అవి రైతు కూలీ సంఘం సభలు (కరీంనగర్ 83, వరంగల్ 90) ఎ ఐ ఆర్ ఎస్ ఎఫ్ మహాసభ (నిజాం కాలేజి గ్రౌండ్స్, 1985) ఆ మూడుచోట్ల ఆ చిత్రాల గురించి వివరించడానికి కూడ ఆయన లేడు. ఆ అవ సరమూ లేదు.

ఆ చిత్రాల్లో ప్రజల విప్లవోద్యమ ప్రగతిని ప్రతిఫలించేవి. అవి సజీవ స్పందనలు. కామ్రేడ్ పాణిగ్రాహి, కామ్రేడ్ సముద్రుడు ఒక చేత తుపాకీ, మరొక చేత కలంపడితే కామ్రేడ్ శంకర్ ఒక చేత కుంచె, మరొక చేత తుపాకీ పట్టిన యోధుడు. అనతికాలంలోనే రంగారెడ్డి జిల్లాలో విప్లవోద్యమాన్ని విస్తృతపరచి పీడిత ప్రజల హృదయాల్లో సజీవ చిత్రమై నిలిచిపోయాడు.

హైదరాబాదు నగరంలో పత్రికలో గంగన్న 'ఎన్‌కౌంటర్' వార్త చదువు

ప్రజల గుండెల్లో....

పెట్రోస్ బ్రోవ్కా

ఎందరు అమరులయ్యారో కదా !
పశువుల మందను చుట్టి ముట్టినట్లు శత్రువు కమ్ముకున్నప్పుడూ,
సోదాలు జరిగినప్పుడూ దాడుల్లోనూ పోరాటంలోనూ
ఎంతమంది నేలకొరిగారో, నా అన్నలారా ?
మీ కోసం నిర్మించిన గర్వించదగ్గ అసంఖ్యాక స్మారక స్థూపాలలోనా
అశేష ప్రజారాశుల గుండెల్లోనా మీరు ఆదమరచి నిదురపోతుంటారు
అన్నలారా ! మీరు అజరామరమైన కీర్తి కిరీటాల్ని ధరించారు
ఎదనిండా ప్రేమతో ప్రజలు మీ విషాద గాథను తలచుకుంటారు
మీ బలిదానాలన్నింటినీ మేము లెక్కించి, ఎక్కించాం చరిత్రపుటల్లోకి

తున్నపుడు చుట్టూ చింది మెరుస్తున్న రక్తచిత్ర రంగారెడ్డి జిల్లా నేలమీద ప్రభాత సూర్యుని కిరణాల్లో కామ్రేడ్ శంకర్ దరహాసం పలకరిస్తున్న విషాదానంద పులకరింత.

మనిషి మరణం దుస్సహం బలవన్మరణం, అర్థాయుష్య మరణం అన్యాయం. పుట్టుకవల్లనే కాకుండా ఆచరణవల్లకూడ అతడు మనిషయినపుడు, మానవుల్లోనూ నూతన మానవుడయినప్పుడు, ఆ నూతన మానవుని గురించి విని వుండడమే కాదు, మన అనుభవంలోకి వచ్చినపుడు, ఎన్నాళ్ళకో ఆకస్మికంగా ఆ మనిషే ఈ నూతన మానవుడని తెలిసినపుడు

టాగోర్ గీతంలో చెప్పినట్లు అప్పటికే అతడు వెళ్ళిపోయాడు.

ఆ నేలలో ఆ నెత్తురు ఇంకిన చోట ఆకుపచ్చ చిగుర్లు వేస్తాయి. నెత్తురు ఎండిపోవడమో, గడ్డ కట్టడమో కాకుండా పాలుగానో పంటగానో మారి భవిష్యత్ తరం నోటికందితే అది మరణమెలా అవుతుంది. అమరత్వమవుతుంది.

మీరే గెలిచారుగానీ, ఇప్పుడు బతికిలేరు విజయాన్ని తిలకించడానికి
మమ్మల్ని విడిచి ఎంతో నిబ్బరంగా, హుందాగా
మీరు ముందే వెళ్ళిపోయారు
మీకు చెల్లించాల్సిన అమూల్యమైన బాకీని
మేము తలచుకుంటున్నాం ప్రగాఢంగా, మహోన్నతంగా
మీరు అస్తమించారు, అయితేనేం అన్నలారా
మీరు ఎదుర్కొన్న కిరాతక శత్రుమూకలు
మనకి మూల్యం చెల్లించక తప్పలేదు భారీగా
శత్రువు నెదిరించినపుడు మీ చేతుల్లో
తళుకు లీనిన పతాకాలివిగో
ఇప్పుడీ నేలపైన, సువిశాలమైన మీ సొంతగడ్డమీద
రెపరెపలాడుతున్నాయి
అన్యాయం రాజ్యం చేస్తున్న చోట అణగారిపోతున్న జనంలో
మీ సాహసిక జీవిత ఘట్టాలు సజీవంగా నిలుస్తాయి
మీరెప్పటికీ నేస్తాలే పొలాలకీ, ఫ్యాక్టరీలకీ
ఈ విశాల విశ్వానికీ, పసిపాపల సంతోషానికీ
మీ అందరినీ బాగానే గుర్తిస్తోంది కొత్తతరం
గర్వించదగ్గ మీ బాటలోనే కొనసాగుతోంది మా పయనం
మీ త్యాగాల స్మారక చిహ్నాలపైకి
తన నీలాకాశపు సౌందర్యాన్ని ప్రసరిస్తూ
స్వర్గమే శిరస్సు వంచింది
ఏళ్లెన్ని గడిచినా నిత్య యవ్వనులు మీరు
ఎన్నటికీ బలహీనులు కారు
ఒక హక్కుగా ప్రజల హృదయాల్లో హత్తుకున్నారు.

అనువాదం : పరజ

సిరియా కవిత :

అభినేత

నజర్ కబ్బానీ

నజర్ కబ్బానీ సిరియా రాజధాని దమిశ్క్ (డెమాస్కస్)లో జన్మించాడు. విద్యాభ్యాసం తర్వాత సిరియా ప్రభుత్వ దౌత్యశాఖలో చేరాడు. దౌత్య వ్యవహారాల్లో దేశదేశాలు తిరిగాడు చైనాలో సంయుక్త అరబ్ గణతంత్ర రాజ్యాల రాయబారిగా కూడ పనిచేసాడు.

1944లో వెలువడిన మొదటి కవితా సంకలనంతోనే ఆయన అరబ్ ప్రపంచంలో ఉత్తమ గేయకవిగా పేరొందాడు. ఆ తర్వాత కూడ ఆయన అప్పుడప్పుడు కవితలు ప్రచురించాడు. ఒకటి రెండు మినహాయించి ఈ అన్ని కవితల్లోనూ వస్తువు ప్రేమ, స్త్రీ. ఇరవై సంవత్సరాలదాకా కబ్బానీని సమకాలీన అరబ్బు సాహిత్య జగత్తు 'శాయర్ అల్-హుబ్బ్వా-అల్-నిసా'(నారీ-ప్రేమకవి)గా ప్రసిద్ధంగా చెప్పుకున్నది.

'967 అరబ్ ఇజ్రాయిల్ యుద్ధంలో ఇజ్రాయిల్ జెరూసలెంతోపాటు మొత్తం పాలస్తీనా భూఖండాన్ని, సిరియాలోని గోలన్‌హాయిట్ ప్రాంతాన్ని కూడ ఆక్రమించుకున్నది.

ఈ యుద్ధంతర్వాత కబ్బానీ భిన్నమయిన కవిత్వం రాయడం ప్రారంభించాడు. ఇది తిరుగుబాటు కవిత్వం. ప్రస్తుత కవితలు ఆయన 'అభినేత' సంకలనంలోనివి.

1948లో ఇజ్రాయిల్ ఏర్పాటుతో మొదలై 91 గల్ఫ్ యుద్ధందాకా సామ్రాజ్యవాదం అరబ్‌దేశాలపై సాగిస్తున్న దురాక్రమణకాండ భారతదేశానికి 'ఆర్థిక సహాయం' రూపంలో విస్తరిస్తున్న సమయంలో కబ్బానీ పరివర్తన మన వయ్యక్తిక లోకంలోని బుద్ధిజీవులకేమైనా కనువిప్పు కాగలదేమోనని.

లిఖిత శబ్దాలు
చట్టం నిషేధించిన హాషీష్‌గా
భావించే నగరంలో
ఆలోచనయే వేశ్యావృత్తిగానో
వ్యసనంగానో నిందించబడేచోట
చట్టం నేరంగా దండించేచోట
జనం కప్పల లాగయిపోతారు
కళ్ళు పీకేసిన కప్పలు
వాళ్ళు తిరుగుబాటు చేయలేరు ఫిర్యాదు చేయలేరు
పాడలేరు బాధపడలేరు
చావరు బతకరు

అటువంటప్పుడు
అడవిపువ్వులు పిల్లలు ఆహుతయిపోతారు
ఫలాలు మాడిపోతాయి
అప్పుడు మనుషులు
తమదేశంలోనే
బొద్దింకలవలె నికృష్టులవుతారు

× × ×

న్యాయం కెరటాలమీద నడయాడే
నౌకగా పరిణమించిన నగరంలో
మనుషులు తమ బి స్తర్లలోనే తాము
భయాందోళనలతో పడిపోయినపుడు
కన్నీళ్ళు కన్రెప్పలకన్నా పెద్దవయినపుడు
అపుడన్ని విషయాలు అణగిపోతాయి
అన్ని విషయ లు ధ్వంసమవుతాయి
సూర్యుడు దినము సముద్రము కాలము
రాత్రి దినము సముద్రము తీరము
దేవుడు మానవుడు

× × ×

జూన్ యుద్ధం అంతమయింది
మేం చాల బాగున్నాం, శుభాకాంక్షలు
మా సమాచారమంతా మంచే
మా రాజ్యం - దేవుని దయవల్ల - మహత్తరంగావుంది
కాలువ నీళ్ళల్లో కడిగిన వంటబొగ్గు శుభ్రంగావుంది
సరససల్లాపాలు ఇపుడుకూడ సజావుగా సాగుతున్నాయి
యాలక్కాయ కాఫీ డికాషన్ పసందుగావుంది
మా ఆకాశంలో అమర్చిన చంద్రగోళం అపురూపంగావుంది
స్వర్గం నుండి ఫైరూజ్* స్వరం వినొస్తున్నది -
"మేం తిరిగొస్తున్నాం"
వాళ్ళు మా తలుపులకు రెండడుగుల దూరంలోనే వున్నారు
"మేం తిరిగొస్తున్నాం"
వాళ్ళు మా పక్కలో నిద్రిస్తున్నారు
"మేం తిరిగొస్తున్నాం"

మేం కేవలం ఈ మాత్రం అనగలం -
"ఇన్నాలిల్ల హేవా ఇలహే రాజవూన్"
(అల్లా మనుషులం మళ్ళీ అక్కడికే తిరిగిపోతాం)

× × ×

జూన్ యుద్ధం అయిపోయింది
ఏమీ జరగనట్లే వున్నది
మా ముందు మొహాలు, కళ్ళు మారనేలేదు
అన్వేషకులు తిరిగి వచ్చారు
అన్వేషణ కూడ తిరిగి వచ్చింది
లాల్‌బుచుక్కడ్ డాన్ క్వెక్సాట్
ఇప్పటికీ తమ పాత్రలు నిర్వహిస్తూనే వున్నారు
మరి జనం
ఏడ్వడం కష్టం గనుక
నవ్వుతున్నారు
మేం, సంతుష్టిగా వున్నాం
యుద్ధంవల్ల మేం తృప్తిగా వున్నాం
శాంతివల్ల మేం సంతృప్తిగా వున్నాం
భూగోళం మీద మేం సంతుష్టిగా వున్నాం
స్వర్గంలో సురక్షిత గద్దెలపై
అమరిన ప్రతివిషయంతో మేం
ఆనందంగా వున్నాం
మరి మేం ఈ మాత్రం చెప్పగలం :
(ఇన్నాలిల్లాహే వా ఇలహే రాజవూన్)
("అల్లా మనుషులం మేము మళ్ళీ అక్కడికే వెళ్ళిపోతాం".)

× × ×

రంగస్థలం భుజాలదాకా కాలిపోయింది
కాని నటుడింకా జీవించే వున్నాడు

---

* ఫైరూజ్ లెబనాన్ గాయకుడు. అరబ్ శరణార్థుల "మేం తిరిగివస్తున్నాం" గీతాన్ని ప్రసిద్ధం చేసాడు.

చైనీస్ కథ :

బాల గెరిల్లా

వాంగ్‌యాన్ చిన్

ఆ సంఘటన 1935 వేసవిలో జరిగింది.

ఎర్రసైన్యంలోని ప్రధాన బలగాలు లాంగ్‌మార్చ్ ప్రారంభించిన తరువాత మైపెచీ గ్రామంలో నిర్బంధం మొదలయింది. గ్రామాలకు తిరిగివచ్చిన దొరలు, తెల్ల సైనికులు గ్రామాలలో బీభత్సం సృష్టించటం, కౌళ్ళ వసూలు చేయటం, భూములు స్వాధీనం చేసుకోవటం, విప్లవకారులను హత్య చెయ్యటం, వారి కుటుంబ సభ్యులను సీమాంతరాలకు అమ్మకానికి పంపటం లాంటి దారుణాలెన్నో చేస్తున్నారు. ఆ దారుణ కృత్యాలు అన్ని వైపులకూ పాకాయి. తెల్ల దోపిడీ సైన్యానికి చెందిన మూడవవిభాగం లోని ఒక ప్లాటూన్ ఆ గ్రామానికి వచ్చాక పరిస్థితులు మరీ అధ్వాన్నమయ్యాయి. ఆ ప్లాటూన్ కమాండర్ లీయూతాంగ్. ఆ స్తెపరుల నాయకుడైన సన్‌హ్యూన్ హ్వాన్ "కత్తులు నూరుతున్నాం - కొత్త తరం మానవులను సృష్టిస్తాం" అని ప్రజలను భయపెడ్తున్నాడు. అంటే విప్లవ స్థావరాల్లో ఉన్న ప్రజానీకాన్ని మొత్తంగా ఊచకోత కోస్తానని హెచ్చరిస్తున్నాడన్నమాట. శత్రువు నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, విప్లవ ప్రజానీకం యొక్క బాధలకు బదులు తీర్చుకోటానికి మా గెరిల్లా విభాగం దాడి చేయాలని నిర్ణయం తీసుకుంది. దీనివలన రెడార్మీ గెరిల్లాల బలం రుజువు అవుతుంది. ఆయుధాల సంఖ్య పెరుగుతుంది. మాకున్న అప్పటి పరిమితుల దృష్ట్యా ఈ చర్య చాలా మేజర్ ఆపరేషనే. శత్రువులు కూడా తగు జాగ్రత్తగా తమ రక్షణ వలయాన్ని ఏర్పరచుకున్నారు. గ్రామం చుట్టూ కోటగోడ నిర్మించారు. గోడ పొడవునా దగ్గర దగ్గరలోనే అనేక వాచ్-టవర్స్‌లో తుపాకులతో సిద్ధంగా వున్నారు. బలమైన ఎదురుదాడి శక్తికి మించిన పనే. అందువలన శత్రుస్థావర సమాచారాన్ని దాడికి ముందే సేకరించవలసి వచ్చింది. దాడి చేసే దళ నాయకునిగా ఈ బాధ్యత నాపైనే పడింది.

పర్వతాల్లోని మా స్థావరంనుంచి మైపెచీకి మున్పై అయిదు కి. మీ. వుంటుంది. నేను పొద్దుపొడవకముందే కాలిబాటలగుండా ఆ గ్రామానికి బయలుదేరాను. చాలీచాలని

తిండి, నిద్రలతో చాలాకాలం గడపటంవల్లనేమో నాకు చాలా నీరసంగా వుంది. పైగా ఈ బాటలన్నీ అస్పష్టంగా వున్నాయి. ఇరవై కిలోమీటర్లు నడిచేసరికి నాకు దిగ చెమటలు పట్టి ఇక నడిచే ఓపిక లేకపోయింది. మధ్యాన్నంకూడా కాకముందే విశ్రాంతి తీసుకునేందుకు నిర్ణయించుకున్నాను. దగ్గరలోనే పాడుబడ్డ గుడి కనిపించింది. తొందర తొందరగ గుడి దగ్గరకు వెళ్ళి చుట్టూ పరిశీలించాను. సమీపంలో మానవమాత్రుని జాడలేదు. విరిగిన గేటు తెరుచుకుని లోపలకు చేరాను. తరువాత జరిగిందంతా నా స్వయం కృతాపరాధమే. ఆద్యంతం ప్రమాదాలలో గడిపిన జీవితం మమ్మల్ని అతి సాహసికులుగా మార్చింది. ఈసారి మాత్రం ప్రమాదాలను నేనే పిలిచినట్లయింది. లోపలకు వచ్చాక గర్భగుడి ముందు గ్రే యూనిఫారంలో వున్న మనుషుల్ని చూశాను. వాళ్ళు తెల్ల దోపిడీ రక్షణ సైన్యం. మధ్యలో కూర్చున్న కొంతమంది పాచికలతో జూదమాడుతున్నారు. గేటు కెదురుగా వున్న సైనికునికి టోపీ ఒక పక్కకు వాల్చి వున్నది. నోట్లో ఒక చివర్న సిగరెట్ వుంది. చేతిలో రెండు నల్లపాచికలున్నాయి. "గుడ్" అని అరుస్తున్న వాడి కళ్ళు అంటోతు కళ్ళలా ముందుకు పొడుచుకొచ్చాయి.

ఈ దుర్మార్గులు నా రాకను గుర్తించినట్లున్నారు. భయకంపితులైన వాళ్ళు డబ్బును ఏరుకుని తుపాకులను తీసుకోటానికి సిద్ధపడ్తున్నారు. ఎక్కువసేపు ఎదురు చూడటం మంచిది కాదని నాకున్న టైంలో వీలైనంతమందిని చంపాలని నా మేగజైన్ పిస్టల్ తీసి గుంపు మధ్యలోకి కాల్పులు జరిపాను. వెనుతిరిగి గేటుదాటి పొదలలోకి పరుగెట్టాను. పరుగెడుతూ నా పిస్టల్‌లో కొత్త కేట్రిడ్జ్‌లు నింపాను.

తెల్ల దెయ్యాలు తరుముతుండగా గుడినుంచి అరకిలోమీటర్ పరుగెత్తాను. రొదపెడుతూ బులెట్లు నన్ను చుట్టుముడుతున్నాయి. అవి తగిలిన చెట్ల ఆకులు నేల రాలుతున్నాయి. బుల్లెట్లు తగిలిన రాళ్ళనుండి దుమ్ము రేగుతోంది. వాళ్ళు నాకు చాలా దగ్గరగా వచ్చారు. ఎదురు కాల్పులు జరిపేందుకు ఒక క్షణం ఆగేసరికి నా ఎడమ ముంజేతిలోకి బులెట్ దూసుకెళ్ళింది. వెంటనే నాకు తలతిరగటం మొదలైంది. నా కాళ్ళలోని శక్తి పూర్తిగా హరించుకుపోయింది. గాలిలో తేలుతున్నట్లుగా అనిపించసాగింది. నాకు దెబ్బ తాకిన సంగతి తెలిసింది. "ఎలైనా మీరు నన్ను బతకనియ్యరు" అనుకుంటూ తుపాకిని బెల్టులో చేర్చాను. కుడిచేత్తో గాయంనుంచి రక్తం కారకుండా పట్టుకొని దగ్గరలోని కొండచెరియలోకి కొన్ని తడబాటు అడుగులు

వేశాను. కొద్దిగా వంగి అంచును ఆదరువుగా చేసుకుని కిందికి వెళ్ళేందుకు ప్రయత్నించా. ఒక రాయి కాలుకు కొట్టుకుని దొర్లుతూ ఆ వాలునే జారిపోయాను. రాళ్ళు, పొదలూ శరీరాన్ని తాకినప్పుడు నొప్పిగా అనిపించింది. కొంతసేపటికి స్పృహ తప్పింది. దానితో నేనెంత దూరం దొర్లిందీ, నేను ముక్కలు ముక్కలు కాకుండా ఏ పొద ఆపిందీ గుర్తించలేకపోయాను. కొంత ప్రయత్నం మీద ఆలోచనలను, ఓపికను కూడదీసుకుని కళ్ళు తెరిచాను. కొమ్మల సందులనుండి చూస్తే లోయ దిగువకు బాగా దగ్గరలో ఉన్నట్లు గ్రహించాను. పైకి తలెత్తి చూస్తే నిడుపాటిరాయి అగుపించింది. దాని చాటున వున్న తెల్ల దెయ్యాలు నా దృష్టికి అందటం లేదు. వాళ్ళ మాటలే వినవస్తున్నాయి.

పొదలచాటున బోర్లాపడి తుపాకిని బయటకు తీసి, మనసులో అనుకున్నాను "నేను ఎట్లాగూ తప్పించుకోలేను. ఎవడు దగ్గరకొచ్చే సాహసం చేసినా కాల్చిపారేస్తా! అపుడు నా వెనకనున్న పొదల్లో అలికిడి వినబడ్డది. అటు తుపాకి గురి తిప్పి "ఎవరది ?" అని లోగొంతుకతో అరిచాను.

"నేను మామ" ఒక గొంతు వినబడింది. కొమ్మల మధ్యనుంచి ఒక ముఖం కనిపించింది. అది పన్నెండూ, పదమూడూ ఏళ్ళ పిల్లవాడు - చురుకైన, కొనతేలిన ముక్కు, దవడ ఎముకలు కనిపించే ఆ పలుచటి ముఖం. తల బాగా పెరిగి పిచుక గూటిలా తయారయింది. దట్టంగా వున్న కనుబొమ్మల కింది చిన్ని కళ్ళు నావైపు తొంగిచూశాయి. నేనున్న పొద పక్కకు దూకి, ఆ చిన్నారి చేతితో నన్ను పట్టుకుని "లే మామ ! మనం ఇక్కడ్నుంచి త్వరగా వెళ్ళాలి. ఆ దెయ్యపు వెధవలు వచ్చేస్తున్నారు" అని చకచక అన్నాడు.

జవాబుకోసం ఆగక నా ఎడంచేతిని భుజంపై వేసుకున్నాడు. నాకు మరో మార్గం లేదు - అతని సాయం తప్ప. అందుకే రాళ్ళు, రప్పలూ దాటుకుంటూ లోయ దిగువవరకు అతన్ని అనుసరించాను. దారి అధ్వాన్నంగా వున్నచోట్ల నేను పూర్తిగా వొరగటంవల్ల అతను మెడసాచి తన సర్వశక్తీ కూడదీసుకుని నిలదొక్కుకునేవాడు. మేము లోయ దిగువకు చేరేంతలో పిల్లవాడు ఒక రాయిమీద అడుగు వేయటం, జారి పడిపోవటం జరిగింది. నేనూ నిలవలేక అతనిపైబడ్డాను. నాకు చాలా సిగ్గు వేసింది. అధాటుగా లేవబోయిన పిల్లవానికి చేయి సాయం అందించాను. ఆ షాకొకు అతని ముఖం వివర్ణమైంది. దెబ్బ తాకిన నా చేతిని తన చేతు

ల్లోకి తీసుకుని "మామా! నీకు బాగా దెబ్బ తాకిందా?" అని అడిగాడు. నేను వెంటనే "అబ్బే - ఏం తాకలేదు. నీకు బాగా బాధ కల్గించిన" వణుకుతున్న గొంతుతో జవాబు చెప్పాను. అతని నుదుటన పడ్డ బొప్పిని చేత్తో తడిమి, "దగ్గరికి వచ్చినం గదా! ఫర్వాలేదు. నేను నడవగలను" అన్నాడు. కాని మాట్లాడకుండానే తల అడ్డంగా వూపి మళ్ళీ నాకు సాయమందించాడు.

ఆ ప్రాంతం పిల్లవానికి కొట్టిన పిండిలా వుంది. ఒక గోతిని దాటి కంకితోపు లోకి, క్రిందగా వున్న ఎత్తైన చెట్లమధ్యకు వెళ్ళాడు. అక్కడంతా గడ్డి పరచి పడకలాగా అమర్చి వుంది. పిల్లవాడు అక్కడే పడుకుంటాడు కావొచ్చు! ఆ పక్కనే విరిగిన కొడవలీ, సగం చీకిన బొప్పాయి పండూ వున్నాయి. నన్ను ఆ గడ్డిమీదే పడుకోబెట్టి "మామా! నువ్వు ఇక్కన్నే దాక్కో-ఆ తెల్ల దెయ్యాలు చూడ లేవులే" అన్నాడు. నాకు మిగిలింది - అతను చెప్పినట్లు చెయ్యటమే. హడావిడిగా దిగటంవల్ల గడ్డ కట్టాల్సిన గాయం చెదిరి మళ్ళీ రక్తం కారుతున్నది. కట్టుకోసం ఏదైనా దొరుకుతుందేమోనని నేను పరికించాను. ఇంతలో పిల్లవాడు తన చిరాదే ప్యాంటును సర్రున చించి నాకు కట్టుకట్టాడు. కట్టు కడుతున్నపుడు కారుతున్న నెత్తు రును దగ్గరలోని బొప్పాయి చిప్పలోకి పట్టాడు. "అది ఎందుకు ?" నేను కుతూ హలంగా అడిగా - "మనిషి నెత్తురు అన్నిటికన్న ఎక్కువని మా అవ్వ చెప్పింది. ఇప్పటిదాకా చాలా కారిపోయింది. ఇది గనుక తాగుతే మళ్ళీ నెత్తురు పడ్తది." అని చాలా సీరియస్‌గా అన్నాడు.

"భలేవాడివిలే - మనిషి నెత్తురు తాగేవాడ్నెవడ్నన్నా చూశావా ?" నవ్వుతూ అడిగా. నేను తాగనని గ్రహించి - సగం నిండిన బొప్పాయి చిప్పను చూసి విడి యంగా నవ్వాడు.

బ్యాండేజ్ సరిచేశాడు. బయట ఏం జరుగుతున్నదా అని శ్రద్ధగా ఆలకించాను. శత్రువు మాటలు కొండచరియకు ఆవలి భాగానే వున్నట్లు గ్రహించాను.

పిల్లవాడు రెప్పపాటు కాలం మౌనంగా వున్నాడు. అకస్మాత్తుగా అతని కళ్ళు మెరిశాయి. నాకు కన్నుగొట్టి "మామా ఇక్కడే వుండు. నేను ఇప్పుడే వస్తా." నేను ఆప ప్రయత్నించే లోపే బొప్పాయితో పరుగెత్తాడు. కొన్ని అడుగులు వేశాక వెనుతిరిగి వచ్చి నా బూటు ఒకటి వూడలాగి "మామ నాకిది కావలె. నువ్విక్క డ్నుంచి కదలొద్దు. నేను త్వరగా వస్తా" అని కుందేలులా ఉరుకుతూ వెదురుతోపు దాటిపోయాడు.

పిల్లవాడు ఏం చేయాలనుకుంటున్నాడు? ఆ దయ్యాలు ఇతన్ని చూస్తే ఏం చేస్తాయి?.... ఆలోచించే కొద్దీ నాకు ఆలజడి పెరుగుతున్నది. కర్రసు ఊతంగా తీసుకుని తోపు అంచుకు చేరి ఒక పొదచాటున దాగాను. తుపాకితో సిద్ధంగా వున్నాను.

చీకటి పడబోతున్నా పిల్లవాడు రానేలేదు. ఇంతలో దెయ్యాలు కిందకు దిగనారంభించాయి. వాలుపైనుంచి అన్ని వైపులకు చూస్తున్నారు. పిల్లవాడు ఏమయ్యాడోననే టెన్షన్ పెరగసాగింది. నేను గురిపెట్టాను. వాళ్ళకేమీ కనిపించినట్టు లేదు. కాని నేను పొర్లిన గడ్డిమీద రక్తపు మరకలకోసం వాళ్ళు వెతుకుతున్నారు. నేనున్న దిక్కు చూడనైనా లేదు. నాకు వ్యతిరేక దిశలో వాళ్ళు లోయలోకి దిగనారంభించారు. పొద అడ్డంగా వుండటంవల్ల నేను తరువాత చూడలేకపోయాను. పిల్లవాడు ఎక్కడన్న దాక్కున్నాడేమోననే అనుమానం కలిగింది. ప్రయత్నంమీద నేను సరైన పొజిషన్‌లోకి - అవసరమైతే కాల్పులు జరిపే వీలున్న పొజిషన్‌లోకి నిలబడ్డాను. శత్రువు లోయకు అటువైపు వున్న దిబ్బపైకి ఎక్కనారంభించాడు. అక్కడ కొంచెం ఆగి మరలా కొండచాటుకు వెళ్ళారు.

అనుమానం వచ్చి వెదురుతోపులోని పిల్లగాని 'ఇంటి'లోకి చేరాను. అతను తిరిగి రాకపోతే ఈ స్థలాన్ని త్వరగా వదిలి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. నేను గడ్డిపరుపుమీద చేరుతుండగా ఒక గడ్డిమోపు కదలటం కనిపించింది- పరిశీలనగా చూస్తే అదీ..... అదీ పిల్లవాడే! కళ్ళలో నీరు తిరుగుతుండగా నా వైపు తదేకంగా చూశాడు. గడ్డీ గిడ్డీ అవతల పడవేసి నన్ను వాటేసుకుని "మామ.... ఎక్కడికెళ్ళినవ్. నీ కోసం చాలా చోట్ల వెతికిన" అన్నాడు.

చాలా కాలానికి కలిసిన ఆత్మీయుడిలా అనిపించాడు. ఆ చిన్నారి చేతులను ఉద్వేగంగా, ప్రేమగా తాకాను. ఆ పిల్లవాడిలో చాలా మార్పు కనిపించింది. బట్టలన్నీ చిరిగినాయి-చేతులపైనా ముఖమంతా గీరుకపోయి ఉన్నది. "నువ్వేం చేశావు?" ఆసక్తితో అడిగాను.

"దెయ్యాలను బోల్తా కొట్టించిన. నీ నెత్తుటి మరకలుపడ్డ దగ్గర ఇసుక, మట్టితో తుడిసిన. నువు బొర్లిన గడ్డిని సర్ది, ఇంకోచోట నేను బొర్లాను" అని చెప్పాడు. ఆ పనులన్నీ ఎట్లా చేసిందీ నటించి చూపిస్తూ "అందుకని నీ కోసం వాళ్ళు ఇటు చచ్చినా రారు".

"నా కోసం అంత ధైర్యం చేసినవ్— ఒకవేళ నువ్వే దొరికితే...."

"నేను చిన పిల్లగాన్ని. అళ్ళను బోల్తా కొట్టించే అయిడియాలు బొచ్చెడున్నయ్. దానితో పాటు ఇది కూడ ఉంది" అంటూ తన రక్షణకు తయారుచేసుకున్న గడ్డి చాపను చూయించాడు. "నీ జాడ దొరక్కపోతే వాళ్ళు అంతట వెతుకుతారు. అందుకనే ఉరికి గుట్ట కటుదక్కుపోయి, నీ నెత్తురును బాగా కనిపిచ్చేట్టు రాళ్ళమీద పోసిన. వొంక ఒడ్డుదాకా పోసుకుంట పోయిన. ఒక పెద్ద రాయిని దారిలో ఈడ్చుక పోయిన. మామ, నీ బూటును కాలువ ఒడ్డున పారేసిన. మనం 'దాగుడుమూతలు' ఆడుతంగద. గట్లచేసిన. మల్ల బాలుకేం తొడుక్కుంటావన్నది ఇసారం చెయ్యలే".

"ఇపుడు బూటుకోసం ఏం ఆలోచించాలిలే" నేననుకున్నాను. అంత తక్కువ సమయంలో చాలా చేశాడు ఈ టక్కరి! "నీకు భయం వెయ్యలేదా ?" అని మాత్రమే అడగగలిగాను. పిల్లాడు కన్నుగొట్టి, "అదేముంది బయపడేది ? ఆ తెల్ల దెయ్యాలు ఎదురుపడ్డప్పుడు నేను పుట్టగొడుగులు ఏరుతున్నట్టు నటించాను. "ఇటు ఎవరన్నా వెళ్ళటం చూశావా ?" అని అడిగారు. నేను 'నల్ల అంగీ మనిషా?' అన్నాను.... "అతనయితే కొండమీదకు ఉరికాడు" అని చెప్పిన. తరువాత ఒక చెట్టెక్కి వాళ్ళు అటే వెళ్ళటం చూసిన" అని స్వచ్ఛంగా నవ్వుతూ చెప్పాడు. అతని అమాయకత ఉట్టిపడే ముఖం చూసి, అతని తెలివి తేటలకు ఆశ్చర్యపోయాను. నాకు ఎలా మాట్లాడాలో అంతుబట్టలేదు. ఆ బుల్లి చేతులను అందుకుని "తమ్ముడూ నా ప్రాణాన్ని నీకు బాకీ పడ్డ" అని మాత్రం అనగలిగాను.

నేను ఆ మాటలన్నప్పుడు ఇబ్బందిగా తలవంచుకుని నా దగ్గరకు వచ్చి మాట మార్చాలని నా దెబ్బతాకిన చేతిని ముట్టుకొని "మామా ఇంకా నొప్పి వుందా !" అని అడిగాడు. "అబ్బే లేదయ్యా". రక్తం గడ్డ గట్టటంచేత నాకు నిజంగనే నెప్పి లేదు- బహుశ రక్తం గడ్డ కట్టినందువల్ల నేమో !

"నాకు ఉత్తమాట చెప్పుతున్నవ్. గీక్కపోయిన చేతులే చాల దినాలు నొస్తయి. అంత పెద్ద గాయమయినంక నీకు నొప్పిలేదంటే ఎట్లా ? ఆ నొప్పి లేదంటే నువ్వు గెరిల్లా మామవే ! నువు ఓర్చుకుంటవ్ గద ! చానేండ్ల కింద బాల దండు సభ్యులమైన మేము దెబ్బలు తాకిన గెరిల్లాలకు నీళ్ళిచ్చినం. వాళ్ళు అచ్చం నీలాగే వున్నరు. ఎంత దెబ్బ తాకిన ఆఖరుకు మూలగనన్న మూలగలే తెలుసా !"

"నిజంగనే నాకింకా నొప్పిలేదు. నేను గెరిల్లానని ఎందుకనుకుంటున్నవ్. నేను చెడ్డవాడినేమో !"

"లే....లే.... నువు గెరిల్లావేనని- నాకు తెలుసులే".

"నీకెట్లా తెలుసు ?" నాకు పాత గుర్తులేమీ మిగలకుండా సాధారణ డ్రస్సుల్లో ఈ పనిమీద బయలుదేరాను.

"ఆ- నువ్వు ఎవడినైనా బోల్తా కొట్టిస్తావేమో ? నన్నుకాదు. మొదట తుపాకి మోతప్పుడు నిన్ను తెల్లదెయ్యాలు తరుముతుండడం చూసిన. ఆ దెయ్యాలు తరిమేటోళ్లెవరైనా చెడ్డవాడంటే నమ్మేంత పిచ్చాన్నిగాదు నేను".

"కాని అదొక్కటే చాలదే- నేను గెరిల్లా అయేటందుకు" అతని చురుకుదనానికి ఆశ్చర్యపోయి అడిగాను.

"నీ దగ్గర తుపాకి వుంది. మామూలోని దగ్గర ఉంటదా? నువు ఎదురు కాల్పులు జరపటం చూశాను. నువ్వు ఇద్దర్నో ముగ్గుర్నో కాల్చినవ్. నాకు భలే సంబరంగా వుంది....కొంతకాలం ఎర్ర సైనికులు మా ఇంట్లోనే వున్నారు. ఎంత మంచోళ్ళు! నాకు పిట్టలు పట్టుకోడం నేర్పారు. చదవటం నేర్పారు. భలే భలే కథలు చెప్పేవాళ్ళు. వాళ్ళే నాకు బుల్లి తుపాకి చేసి ఇచ్చారు." నా వైపు చూసి, "నన్ను మోసం చెయ్యలేవ్‌లే. నువ్వు గెరిల్లావే". నా కనుబొమ్మలపైన చూపిస్తూ "నాకు తెలిసిన ఎర్ర సైనికులందరికీ ఇక్కడ తెల్లంగనే వుంటుంది. సిపాయి టోపీ పెట్టుకుంటరుగద! అందుకే అట్లుంటది. నువు కూడ అదే టోపీ వాడతావు కదూ!"

అది విని నా పొరబాటుకు నన్ను నేను తిట్టుకున్నాను. ఈ సంగతే అసలు పట్టించుకోలేదు. ఎంత చురుకైన పిల్ల వాడు! ఆపుకోలేక నవ్వాను. ఎండిన పెదిమలు పగిలి నెత్తురు వచ్చింది. వెంటనే చప్పరించాను. అది చూసి "మామ! దాహంగా వుందా! వుండు. నీళ్ళు తెస్తా" పిల్ల వాడు అన్నాడు.

"వద్దు. దెబ్బ తగిలినపుడు ఎక్కువగా నీళ్ళు తాగరాదు".

"అయితే పండ్లు గిట్లా తినొచ్చా?"

నేను వద్దనను అని తెలుసుకుని నన్ను పడుకోబెట్టి, తను తోపులోకి పరుగెత్తాడు. కొంచెం సేపట్లోనే జేబు నిండా రేగు పళ్ళతో తిరిగి వచ్చాడు. అన్నీ గడ్డి మీద పోసి, పెద్దపెద్దవి ఏరి తొడిమలను వలిచి జాగ్రత్తగా నా నోటికందించాడు. ఆ తియ్యటి (కొంచెం పులుపుతో) రసం గొంతు దిగుతుంటే భలే రుచిగా వుందిలే.

నేను కొన్ని పళ్ళు తిన్న తరువాత ఇంకో జేబులోంచి ఏవో బయటకు తీశాడు. అది అరిటాకులో చుట్టబడి వున్నది. "మామ-నీకు బాగా ఆకలిగా వుంది గదా? కొద్దిగ మాంసం తింటే బాగుండదూ!"

"మాంసమా?" గాభరాగా అడిగాను. ఈ మంచు పర్వతం మీద ఇతనికి మాంసం ఎక్కడ దొరుకుతుంది? ఆ పార్సెల్‌ను తీసుకుని విప్పాను. రెండు కాల్చిన పిట్టలున్నాయి. ఒకదాన్ని సగం తిన్నాడు. బొచ్చు శుభ్రంగా పీకిలేవు - ఇంకా అక్కడక్కడా పచ్చిగానే వుంది - పూర్తిగా కాలలేదేమోననుకుని "మామ నిన్ననే వాటిని పట్టుకుంది. ఇంకా తాజాగానే వున్నాయ్. కొంచెం ఉప్పుంటే భలే రుచిగ వుంటాయ్" అంటూ ఒక కాలు విరిచి నాకు అందించాడు.

మాంసం చప్పరించగనే నా కళ్ళు చెమ్మగిల్లాయి. నా భావాలను భాషలోకి మార్చలేను. ఈ పిల్లవాడు ఎంత గొప్ప హృదయం కలవాడు. ఇప్పటి వరకూ అతని గురించి ఒక్క మాటా అడగలేదు.

" ఈ గుట్ట మీద ఒక్కడివే ఎందుకున్నావయ్యా?"

"గెరిల్లాల కోసం ఎదురు చూస్తున్న" నిబ్బరంగ అన్నాడు.

"ఎందుకు?" "ఎర్రసైన్యంలో చేరెటందుకు"

"నీకు నువ్వే ఎందుకనుకున్నావు? మీ అమ్మానాన్న లెక్కడ ?"

ఆ చిన్నారి మెరిసే కనులతో నన్ను రెప్ప ఆర్పకుండా చూసి, ఒక్కసారిగా నా ఒళ్ళో వాలి వెక్కి-వెక్కి ఏడుస్తూ "మా అమ్మా నాన్న అంతా పొయ్యారు మామ! నువ్వు నా బదులా తీర్చాలి". అతన్ని పొదివి పట్టుకుని రేగిన వెంట్రుకలను చేతితో నిమిరాను. అతని ఓదార్చాలని "తమ్ముడూ! ఏం జరిగింది. అంతా నాతో చెప్పు. నా మీద నమ్మకముంచుకోవచ్చనుకుంటే చెప్పు".

నిదానంగా ఏడుపు దిగమింగి, నా భుజానికి ఆనుకుని కూర్చుంటూ - తన కథనంతా (ఇదే వరసలో కాదు) చెప్పాడు.

పిల్లవాడి ఇంటి పేరు చెన్ - పేరు వాంగ్. త్సైచీకి దగ్గర్లోనే వున్న సంగ్మాపోలో వీళ్ళ నివాసం. ఆ వసంత కాలంలోనే లాంగ్ మార్చ్ నుంచి గాయ పడి వచ్చిన సైనికులకు వీళ్ళ నాన్న ఆశ్రయమిచ్చాడు. ఈ విషయం తెల్ల దెయ్యా లకు తెలిసింది. దెబ్బతిన్న సైనికుడు ఒక తెల్ల సైనికున్ని తన్ని పడగొట్టాడు. వెంటనే ఆ గెరిల్లాను అక్కడికక్కడే కాల్చి చంపారు. పిల్లవాడు బయట ఆడు

కుంటూ వుండగా వీళ్ళ అమ్మనాన్నలను సన్-హ్యాన్-హ్యాన్ అరెస్ట్ చేశాడు. వాంగ్‌ను పక్కింటి మవర్‌లీ దాచింది. వాళ్ళ నాన్నను పక్క టెముకలు విరిగేట్లు కొట్టారు. అమ్మను చనిపోయే వరకు హింసించారు. నాన్నను గ్రామస్తులందరిముందు కాల్చేసారు. ఈ సంగతి తెలుసుకున్న వాంగ్ కొండలలో ఎర్రసైన్యం కోసం అదే రాత్రి బయల్దేరాడు.

"నేను నెల రోజుల నుండి ఈ గుట్టలలో చెట్టూ, పుట్టా వెతికా - అయినా గెరిల్లాలు కనిపించలేదు. అలుపొస్తే రెల్లు పొదల్లో పండటం, దూపయితే వంకల్లో నీళ్ళు తాగటం, ఆకలయితే పండ్లో, పిట్టలో ఎతకటం - ఇదీ నా పని. ఎర్ర సైన్యం దొరికేదాక మర్చిపోను. మా అవ్వా, బాపుల నెత్తుటి అప్పు తీర్చుకోవాలి".

గాలి వెదురు పొదలను చీల్చుకుని వస్తున్నది. ఆ ధ్వని పిల్లవాడి విషాద భరితమైన కథతో కలిసినా గుండెలను పిండేస్తుంది. ఆ కథ విన్న నాకు కళ్ల చెమ్మ గిల్లాయి. చాలా శ్రద్ధగ విన్నాను. వింటున్నంతసేపూ మారు మాట్లాడకుండా ఆ బుల్లి చేతులను స్పృశిస్తూ వున్నాను. ఓదార్చేందుకు మార్గమూ, మాటలు దొరక లేదు! ఒక్కమాట మాత్రం చెప్పగలను. శ్రైనీని ఆక్రమించి వాంగ్ తలిదండ్రు లను చంపిన వారిపై పగ తీర్చగలను.

సున్నితంగా అతని కన్నీళ్ళు తుడిచాను. నెమ్మదిగా, దృఢంగా చెప్పాను- "తమ్ముడూ - మన గెరిల్లా దళం శ్రైనీపై త్వరలో దాడి చేస్తుంది. అప్పుడు బదులా తీర్చుకుందాం".

"నిజంగా" వెంటనే తల ఎత్తి అన్నాడు. అతని కళ్ళు మెరిశాయి. పిడికిళ్లు బిగించి "మామ, నన్ను గెరిల్లాల్లోకి తీసుకోండ్లి - ఎర్రసేనతో చేరి ఆ తెల్ల దెయ్యాలను చంపుతా".

ఉద్రేకంతో నిండిన ఆ ముఖాన్ని పరిశీలించాను. వాంగ్‌ను ఇప్పుడు గెరిల్లా ల్లోకి తీసుకోకూడదనీ, అలాగని ఒక్కడ్నే వదలి వెళ్ళరాదనీ గుర్తించాను. నా సర్వే పనిలో నాతో పాటే అతన్ని తీసుకుపోవాలని నిశ్చయించుకున్నాను. ఏదైనా సాయం అందిస్తాడు. తల వూపి చెప్పాను—"యస్. నిన్ను నాతో తీసుకెళ్తా—అయితే మనం గెరిల్లాల కాడకు వెళ్ళం - మీ వూరే శ్రైనీ వెళ్ళాలి".

నా మాటలు ఇంకా పూర్తి కాలేదు. అప్పటికే అతని ముఖంలో రంగులు మారాయి. నా చేతులను విదిలించుకొని నా వైపు ద్వేషంగా చూశాడు.

అతను తప్పుగా అర్థం చేసుకున్నాడనిపించింది - "పిచ్చి పిల్లాడా? నేను యూనిఫాంలో లేను చూశావా? నేనేం చేస్తుంది నీకు తెలియనా? నాతో పాటు వచ్చి మైన్చీలో తెల్ల దెయ్యాల వివరాలు తెలుసుకుని గెరిల్లాలకు తెలపాలి....అప్పుడు" నా చేత్తో శత్రువును నిర్మూలించడం అభినయించి "అర్థమైందా?" అన్నాను.

వాంగ్ ఎగిరి గంతేశాడు. "నేనూ చేస్తా - నేను కూడా వస్తా" అన్నాడు. తరువాత అనుమానంగా—"నీకు దెబ్బతాకిందిగా - నువ్వెట్లా నడుస్తవ్—"

"ఇపుడే కదా నేను నడిచింది. రా నన్ను నుంచోపెట్టు-మళ్ళా ప్రయత్నిద్దాం" నా చేతిని భుజం మీద వేసుకున్నాడు. దాన్ని ఆధారం చేసుకుని నిలబడ్డాను. వాంగ్‌ను ఆధారం చేసుకుని నడిచాను. బాగానే అనిపించింది. గాయం బాధపెట్టినా ఏ ఇబ్బందీ లేకుండా కాళ్లు కదిపాను. "తమ్ముడూ! ఇక బయల్దేరదాం ఒక వెదురు కర్రనూ, తాడులా వాడేందుకు చెట్టు బెరడునూ తీసుకో".

బెరడుతో తాడు పేని నా నడుముకు కట్టుకున్నా. అదే బెరడుతో చెప్పులు చేసుకున్నా. కర్ర సాయంతో నిలబడి తుపాకీ చేతిలో పట్టుకున్నాను. నేను సిద్ధం అయ్యాక, వాంగ్ ఒక చెట్టు ఎక్కి చుట్టూ పరిశీలించి దిగాడు. "మామ-ఈ దాపులో ఎవ్వరూ లేరే" అంటూ నా చేతిని భుజంపై వేసుకున్నాడు.

మేం పదికిలోమీటర్లు నడిచేందుకు అయిదు గంటలు పట్టింది. ఆగిన ప్రతి సారీ చెట్టెక్కి వాంగ్ చుట్టుపట్ల పరిశీలిస్తున్నాడు. రోడ్డు చదరంగా వుంటే కర్ర సాయంతోనూ కొండలపై వాలుగా వుంటే పూర్తిగా అతనిపై ఆధారపడి నడిచాను. పెద్ద రాతిని ఎక్కాల్సివస్తే ముందు వాంగ్ ఎక్కి, తాడును ఏదైనా చెట్టుకు కట్టే వాడు. తరువాత నన్ను పైకి లాగి సహాయపడేవాడు. గాయం బాధపెట్టినా అతని చురుకుదనం చూసి ఓర్చుకునేవాడిని. మేం మైన్చీ చేరేసరికి చంద్రుడు నడినెత్తిమీది కొచ్చాడు.

కొండల సందులలో సేద తీర్చుకునేవాళ్ళం. ఈ కాస్త సమయాన్ని నా బ్యాండేజి విప్పి తిరిగి కట్టేందుకు వాంగ్ వాడుకొనేవాడు. గ్రామం వైపుకు చేరుతుండగా గుర్తుంచుకోవలసిన సంగతి ఒకటి వాంగ్‌కు చెప్పా- "ఏదైనా అనుకోని విపత్తు జరిగితే-నేను నిన్ను కవర్ చేస్తాను. నువు వెంటనే పారిపోవాలి" అని.

"ఉహూ....నేను పోను" మూతి బిగించి "నీతోనే వుంటాను" అన్నాడు.

"నీకు గెరిల్లా కావాలని వుందా ? లేదా ? గెరిల్లాలు క్రమశిక్షణకు పేరు. నీ ఇష్టమైనట్లు చెయ్యాలనుకుంటే గెరిల్లావెలా అవుతావు ?"

"మామ, నువు చెప్పినట్టు వింటా. గెరిల్లాల్లో చేరేటందుకు ఏం చెప్పినా చేస్తా-"

"అదీ-మంచి లక్షణమంటే" నవ్వుతూ అన్నాను.

మేము చెరకు తోటను చాటు చేసుకుని గ్రామం వైపు కదిలాం. తోట చివరకు పాకుతూ వెళ్ళి చుట్టూ పరికించాను. అదృష్టవశాత్తు ఆ రోజు వెన్నెల శత్రు స్థావరాలపై ప్రకాశిస్తుంది. ప్రాకారగోడలు మనిషికి రెండింతలు ఎత్తు వున్నది. దగ్గర దగ్గరలోనే వాచ్‌టవర్లు వున్నాయి. టవర్స్‌మీద దెయ్యాలు అటూ ఇటూ తిరుగుతూ కాపలాకాస్తున్నారు. ప్రాకారం బయటి అంచున కందకం ఉన్నదీ. దాని చుట్టూ తీగ కంచె ఉన్నది. వాచ్‌టవర్స్ మధ్యగుండా ప్రాకారం లోపలి చెట్లు, ఎత్తైన ఇల్లు కనిపించాయి. గ్రేట్ డిప్పర్ చూసి మేమున్న ప్రదేశం అంచనా వేశాను. స్కెచ్ గీయాలనుకున్నాను. లోపలి జేబులోంచి చిన్న పెన్సిలు, కాగితం ముక్కలూ తీశాను. కాని కాగితం ముక్కలు రక్తం అంటి అతుక్కుపోయాయి. రాసేందుకు పనికిరావు. ఎంత పని చేశాను ? అదృష్టాగా మిగతా జేబుల్లో కాగితం దొరుకుద్దేమోనని వెదికాను.

చాంగ్ దగ్గరకొచ్చి "మామ, ఏమైంది !" అని అడిగాడు.

"స్కెచ్ గీయాలి. పేపరు ఖరాబయింది"

"నా దగ్గరొకటి వుంది. పనికొస్తదేమో చూడండి." పాంట్‌కు చిన్న బొక్క చేసి కాగితం ముక్కను తీసి ఇచ్చాడు. "మదర్ లీ-హూ కుటుంబం ధ్వంసం చేయబడ్డప్పుడు చెప్పిందీ దాచే సంగతి. నన్ను గుర్తించే కాగితం ఇది".

కాగితం తీసుకున్నా. చెరకుగడల సందుల ద్వారా వడబోసిన వెన్నెల వెలుగులో అది 'టిల్లర్స్ సర్టిఫికెట్' అని గుర్తు పట్టాను. అది భూములను రైతులు పంచుకొన్నప్పుడు ఇచ్చింది. నేను ఒక్కసారిగా పులకించిపోయాను. కాని ఆ వివరాలు తెలుసుకునే సమయం లేదిప్పుడు దాని వెనకవైపున టోపోగ్రఫీ (స్థల వివరాలు) రఫ్ స్కెచ్‌ని అనేక సంజ్ఞలతో గీశాను.

చెరకు తోటలను, అరటి తోపును చాటు చేసుకుని గ్రామ పొలిమేరలగుండా ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు- అటునుంచి ఇటు నాలుగుసార్లు తిరిగి పరిశీ

లించాను. మా సర్వే పూర్తయింది. గ్రామపు బయటి పరిస్థితులనూ, ఎక్కడ ప్రధాన దాడి చేయవలసిందీ, బలగాలను ఎక్కడ ఉంచాల్సిందీ, ఎటు నడపాల్సిందీ అన్ని వివరాలనూ మేపలో చేర్చాను. కందకం పరిశీలన మాత్రమే మిగిలింది. దాంట్లో నీరేమైనా ఉందా ? ఉంటే ఎంత లోతువరకు ? ఆ తీగకంచె దాటటమే మా సమస్య. వాంగ్‌తో ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాము-"ఒక్కరమే వెళ్ళివస్తే ఎట్లుంటుంది" అడిగాను. "అవును. అట్లానే" అతను అంగీకరించాడు. అయితే అంతదూరం ఈ వెన్నెల కాంతిలో వెళ్ళేవాళ్ళు సులభంగా అగుపిస్తారు. అతను కనుక కనిపిస్తే, తనేం చేయాలి ? ఆలోచించేకొద్దీ ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతున్నా. పిల్లవాడు తొందర పెడుతున్నాడు. నా భుజం తట్టి "తొందరగ-ఏం చెయ్యాలో చెప్పు మామయ్యా !"

"కందకంలో ఎంత లోతుకు నీళ్ళుందీ కావాలి. కాని ఆ తెల్లదెయ్యాలు చూడ కుండా జాగ్రత్త తీసుకోవాలి" గుసగుసలాడేను. వాంగ్ హుషారుగా "నేనెళ్తా నేనెళ్తా" అని ప్రాకుతూ వెళ్ళాడు. అతన్ని వెనక్కిలాగి చుట్టూ చెరకు ఆకులు చుట్టాను. తలపై కొన్ని ఆకులు కిరీటంలా చుట్టి పైన చెరకు గెడల కొనలు గుచ్చాను. అదిచాలు-శత్రువును మభ్య పెట్టాలంటే.

రెప్పపాటు కాలంలో చెరకుతోట దాటి చదును నేలమీద దొర్లుకుంటూ కంద కం ఒడ్డుకు చేరాడు వాంగ్. అతను కదలిన వైనం గాలికి గడ్డిమోపు దొర్లుతున్నట్టు వున్నదీ. ఆగకుండా కంచె దగ్గరకు చేరాడు. పొలం గట్టున నుంచుని అతనినే గమ నిస్తున్నా - రెప్పవేసే ధైర్యం నాకు లేకపోయింది. ఆహా ! కంచెను దాటి లోపలకు వెళ్ళాడు. ఇపుడు కందకంలోకి దిగుతున్నాడు....

ఆ క్షణంలో రాళ్ళు దొర్లిన శబ్దం వినిపించింది. అది చిన్నగా వున్నప్పటికీ నా హృదయస్పందన పెరిగింది. మెతక నేలమీద కాలుపెట్టి వుంటాడు. జారి వుంటుంది. రాళ్ళుదొర్లి నీళ్ళలోపడి ఆ ధ్వని వచ్చింది. వాచ్‌టవర్ మీదున్న సెంట్రీ "ఎవరది ? ఎవరది?" అని అరిచాడు. నాకు విచారం ఎక్కువయి చెమటలు పోశాయి. తుపాకి పట్టుకుని వాంగ్‌ను రక్షిద్దామని అడుగెయ్యబోయేంతలో కందకంలోనుంచి కుక్క అరుపు వినిపించింది. వాంగ్ అరిచిన ఆ అరుపులు సెంట్రీని మోసపుచ్చాయి. నాలో నేను నవ్వుకుని - ఎంత తెలివిగలవాడు - అనుకున్నా.

అయితే మాకష్టాలు అంతటితో ఆగలేదు. పిల్లవాని భౌ....భౌ.... అరుపు

లను కుక్కలు అందుకున్నాయి. పల్లెలోని కుక్కలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అరవటం ప్రారంభించాయి. ఈ అరుపులకు తెల్ల దెయ్యాలు మేల్కొన్నాయి. కందకంపైకి అనేక టార్చిలైట్లు ఒకేసారి వెలిగాయి. వెడల్పాటి ఆ ప్రాకారంమీద ఒకడు బోర్లా పడుకుని కిందకు చూస్తూ "కందకంలో ఎవడో వున్నాడ్రోయ్" అని అరిచాడు. వాడు తుపాకి కాక్ వెనక్కు లాగటం నాకు వినిపించింది. వాళ్ళు చాంగ్‌ను చూసేశారు. ఎట్లైనా చాంగ్‌ను కాపాడాలి. సెంట్రీ తలకు గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాను. తుపాకిని సరిచేసుకునే వీలుకూడా అతనికి దొరకలేదు. చచ్చి ప్రాకారం మీదపడ్డాడు. చాంగ్ ప్రాకుతూ కంచెదాటి నా దగ్గరకు వచ్చాడు. శత్రువులు మావైపు కాల్పులు జరుపుతున్నారు.

గాయపు బాధను పక్కకునెట్టి చాంగ్‌ను నా చాటున వుంచుకొని చెరకుతోట వెంట పరుగెత్తాం. మేమెంతో దూరం పోకముందు మెయిన్‌గేట్ తీసిన చప్పుడయింది. శత్రువులు మావెంట పడుతున్నారు!

నా గాయంబాధ ఎక్కువైంది. కాల్చిన ఇనుముతో తాకినట్లు మంట పుడుతున్నది. చాంగ్‌ను దగ్గరికు లాక్కుని స్కెచ్ చేతుల్లో పెట్టాను. "గెరిల్లాలకు దీన్ని నువు అందచెయ్యాలి" అని నీరసంగా అన్నాను. నా షర్ట్‌ను వదలకుండా "ఊహూం- నేను వెళ్ళను" అన్నాడు.

"చాంగ్, నువ్వు మళ్ళీ అలానే మాట్లాడుతున్నావు. ఇది నీ దళనాయకుని ఆజ్ఞ" అని గంభీరంగా అన్నాను గొంతు తగ్గించి, "హైచింగ్ పర్వతం చేరేవరకూ నేరుగా తూర్పునే వెళ్ళు. షాట్జుచాన్ గ్రామంలో అంబలి అమ్మే ఫెంగ్ అనే ముసలాయన్ని కలువు. అతనికి ఈ మేప్ ఇవ్వు. పరిశోధనాదళ (Reconnaissance) నాయకుడు హుయాంగ్. కాంగ్-టింగ్ నిన్ను కొండమీదికి తీసుకెళ్ళమన్నాడని చెప్పు. నువు కమాండర్‌ను కలిసినపుడు కందకంలో నువు చూసినది రిపోర్ట్ చెయ్యి. మిగిలిన వివరాలన్నీ ఇందులో వున్నాయి. గుర్తుంచుకో, ఎట్టి పరిస్థితుల్లోనైనా నువు దీన్ని అందచెయ్యాలి".

నన్ను విడిచిపోయేందుకు బాధపడ్తున్నట్లున్నాడు. చాంగ్‌పై ప్రేమ నా హృదయంలో పొంగిపొర్లుతుంది. అతన్ని గట్టిగా కావలించుకుని "మంచివాడివికదూ! మామ మాట వినాలి. అక్కడకు చేరాక నువు శక్తి మొత్తం వినియోగించి చదువు, పనిచెయ్యి! అట్లా మీ తలిదండ్రుల పగతీర్చుకో — అలాగే నా పగకూడా—"

బాధతో దుర్బలుడైనట్లు కనిపించాడు. ఒక్కమాట మాట్లాడలేదు. కన్నీళ్ళు తుడుచుకున్నాడు నా గాయాన్ని సుతారంగా తాకాడు. మేప్‌ను పాంట్స్‌లో దోపుకుని కాలవ వొడ్డునే పరుగు లంకించుకున్నాడు.

నా దగ్గరున్న చివరి కాట్రిడ్జ్ తుపాకీలో పెట్టాను. కాలవ ఒడ్డునే బోర్లా పడుకుని కాల్పులు మొదలుపెట్టాను శత్రువు దృష్టిని నావైపు తిప్పుకుని చాంగ్‌కు వెళ్లే అవకాశం కల్పించాలనేది నా లక్ష్యం. నాఎత్తు పారింది. మొత్తం బలగాలు నన్ను చుట్టుముట్టాయి. ఆపకుండా ఎనిమిది రౌండ్లు కాల్చాను. ముగ్గురు చచ్చారు. చాంగ్ పర్వతానికి చేరేవుంటాడు. ఇంకొకడ్ని కాల్చాక, నాతలకే గురిపెట్టుకున్నా - ట్రిగ్గర్ నొక్కబోయేంతలో తలమీద తాకిన దెబ్బకు స్పృహ కోల్పోయాను.

చన్నీళ్ళు ముఖంపై తగిలి మేలుకొన్నాను. చేతులు కట్టివేసి జైలులో పడవేశారు. మట్టిగోడలతోవున్న ఆ చెరసాలలో మూడురోజులు వుంచారు. ఈ మూడు రోజుల్లో నోటితో చెప్పవీలులేని చిత్రహింసలు అన్నీ అనుభవించాను. నా శరీరంపై ఎక్కడా దెబ్బతాకకుండా లేదు. దెబ్బలవల్ల నా వళ్ళంతా వాచింది. మొత్తం నలగ కొట్టినట్లయింది. బట్టలపై రక్తపు మరకలు మిగిలాయి. పక్కటెముక విరిగినట్లుంది. నా పాతగాయం రేగింది. స్పృహలో వున్నంతసేపూ కిటికీ పక్కనేవుండి పర్వత శిఖరాల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటూ వుండేవాడిని. అలాంటి క్షణాల్లో చావూ, దెబ్బలూ తమ ఉనికిని కోల్పోతాయి. నాకు చాంగ్ గమ్యంచేరాడా! లేదా ? మేప్ అందించాడా ? అందియ్యలేదా ? అనే సందేహాలే బాధను కలిగించేవి. రెండు రోజులక్రితం ఇంటరాగేషన్‌కు తీసుకుపోతుండగా సన్‌హ్యాన్-హ్యాన్ ఇంటి గేటుపక్క రెండు కార్నర్‌టవర్స్ వుండటం చూశాను. రెండింటిలోనూ మెషిన్ గన్నులున్నాయి. దీనిని మేప్‌లో గుర్తించలేకపోయాను. ఇందువల్ల నా కామ్రేడ్స్ ఎక్కువ త్యాగం చేయాల్సిరావచ్చు. సర్వే లోపంవల్ల అంత నష్టం జరిగితే నాకు మనశ్శాంతి మిగలదు.

నాల్గవరోజు నేను కిటికీ దగ్గర నుంచున్నపుడు కిటికీకి ఎదుటి కప్పుమీద ఒక పిల్లవాడు పిట్టలను పట్టటం చూసి ఆశ్చర్యపోయాను. అతను అప్పుడప్పుడు తలఎత్తి నావైపు చూస్తున్నాడు. అ చూసేది చాంగ్ అని గుర్తుపట్టగలిగాను. మామధ్యవున్న చిన్నసందుగుండా మేము కరచాలనం చేసుకున్నాం. చాంగ్ అలసిపోయినట్లున్నాడు. కనురెప్పలు ఉబ్బిఉన్నాయి. నన్ను చూసిన ఆనందంలో అరిచి కప్పుపైనుంచి

జారాడు. నాకు ఎదురుగావచ్చి తూర్పువైపు చేయి చూపి చదరపు గుర్తుగీచి, తల ఆడించాడు.

సంజ్ఞలతో జవాబు చెప్పబోయేంతలో బరువైన బూట్ల చప్పుడు వినిపించి చాంగ్‌ను పొమ్మని సైగచేశాను. అయినా వెళ్ళక గోడకున్న కంతల్లో పిట్టలు వెదుకుతున్నట్లు నటిస్తున్నాడు. ఈ పనిచేస్తూ కీచుగొంతుతో ఇలా పాడాడు —

సూరీడు జారిపోయాడని బాధపడకు,
సూర్యుని బదులు జాబిల్లి వెన్నెల వస్తుంది;
చంద్రుడు మాయమైనపుడు తారలు అవతరిస్తాయి
అవి అదృశ్యమైనపుడు వేకువ వస్తుంది

ఈ పాట నాలుగుసార్లు పాడుతూ నావైపు దీర్ఘంగా చూశాడు. సమాచారాన్ని క్షేమంగా చేర్చినట్టు, రేపటి వేకువనే ప్రతిఘటన మొదలౌతున్నట్లు ఆ పాటద్వారా చాంగ్ చెప్పాలనుకున్నాడు. దానితో నా మనసు, కొంతవరకు ప్రశాంతమైంది. ఆ మెషిన్‌గన్‌లే నన్ను కలవరపెడ్తున్నాయి. ఆ ఇంటి దిక్కే సెంట్రీలవైపు చెయ్యెత్తి చూపించాను. చాంగ్ గాబరాగా చూశాడు. నాకూ అలాగే వుంది. ఇంకో దారిలో వార్త నందించలేకపోయాను. నా సంకెళ్ళను చూస్తూ దగ్గరలో రాసేందుకు ఏమైనా దొరుకుతుందేమోనని వెతికాను. తల ఎత్తేటప్పటికి చాంగ్ పత్తాలేడు.

కొంచెం సేపటికి ఆ గొంతు మళ్ళీ వినిపించింది. ఖైదు తలుపుల దగ్గరకు వచ్చి నాకు కాపలావున్నవాడ్ని ఏడిపిస్తున్నాడు. "నీదగ్గర అంత డబ్బెక్కడిది? అంతా లూటీ చేసిందేకదా? చూబోటి పేదోళ్ళకు కొద్దిగా ఇస్తే ఏమవుతుంది ?...." కాపలావాడు డబ్బు లెక్కపెడుతున్నట్లుంది. అతనిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చాంగ్ చేస్తున్నాడు. ఒక చెంపదెబ్బ, 'అబ్బా' అనే అరుపూ వినబడ్డాయి. "లంజకొడకా - నన్ను కొడ్తావ్‌రా...." తిట్లుకూడా వినబడ్డాయి. ఆ అరుపుల్లోనే పారిపోతున్న చప్పుడు వినిపించింది. సెంట్రీ వెంటబడ్డాడు- "పిల్లరాస్కెల్ - చంపేస్తా, నా డబ్బు నాకిచ్చెయ్...."

నాకు గాబరా ఎక్కువైంది. చాంగ్‌మీద కోపం వచ్చింది. అరే.... ఇతను కోరి కోరి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నాడేంది? అతను చిక్కితే మా కార్యక్రమం దెబ్బతింటుంది. కిటికీ బయట చాంగ్ కుందేలులా గెంతుతూ పోవటం కనిపించింది. పరుగెత్తుతూ దారిపొడవునా డబ్బులు వెదజల్లాడు. డబ్బు ఏరుకోవటంలో సెంట్రీ

మునిగిపోయాడు. చాంగ్ చాలాదూరం పరుగెత్తటాన సెంట్రీ ఆ పనిలో వుండి పోయాడు. సెంట్రీ తుపాకి గురిపెట్టేంతలో చాంగ్ వేరే వీధిలోకి మాయమయ్యాడు.

సెంట్రీ, నోట్లు ఏరుకోవడంలో మునిగిపోయాడు. అది చూస్తున్న నాకు "మామ - ఏంది నువ్వేం చెప్పాలనుకున్నావో తొందరగా చెప్పు. ఉ-చెప్పు" అని వినిపించింది. అటు తిరిగి చూస్తే ఎదురుగా చాంగ్! బాగా రొప్పుతున్నాడు. చాంగ్ చేష్టలకు అర్థం ఇపుడు తెలిసింది నాకు. ఎంత తెలివైన పిల్లవాడు చాంగ్! అతన్ని అభినందించే సమయం లేదు. కొత్తగా తెలుసుకున్న సమాచారం క్లుప్తంగా చెప్పాను. చాంగ్ ఊపిరి పీల్చుకుని "మన దళాలు సాంట్జ్ పర్వతానికి చేరుకున్నాయి. కొంతమంది వీరులు రాత్రికే గ్రామంలోకి వస్తారు. రేపు పొద్దుగాలే యుద్ధం మొదలు".

నేను తలాడించాను. చాంగ్ సురక్షితంగా బయట పడ్తాడా అనే ఆందోళన నన్ను కలవరపరిచింది. అయితే సెంట్రీ ఇంకా అదే పనిలో వుండటం వల్ల గుండెలమీద చేయి వేసుకున్నాను. "ఇక్కడ వుండటం మంచిదికాదు ప్రమాదకరం. వెంటనే వెళ్ళి దళాలకు రిపోర్ట్ చెయ్యి".

ఇది వినిపించుకోకుండా "మామ - ఆ రాక్షసులు నిన్ను బాగా కొట్టారా?" అని అడిగాడు. "అబ్బే-పెద్దగా ఏం లేదు".

"నన్ను మోసం చేస్తున్నావ్ కదూ! ఆ గాడ్డిలు నిన్ను బాగా కొట్టివుంటరు. ఆ వెధవలు...." సెంట్రీ చెంప దెబ్బ కొట్టినా కన్నీరు పెట్టని చాంగ్ ఇపుడు ఏడుస్తున్నాడు. నేను చలించిపోయాను. నిజం చెప్పాలంటే చాంగ్ ఇంకా కొంతసేపు ఇక్కడే వుంటే బాగుణ్ణనిపించింది. సెంట్రీ వెనుదిరిగాడు. "త్వరగా వెళ్ళు. ఆ వెధవ వస్తున్నాడు" అని మాత్రం అనగలిగాను. "సరే.... రేపు పొద్దుగాలనే నిన్ను కలుస్తాను మామ... వస్తాను" అంటూ జేబులోంచి రెండు ముక్కలు తీసి లోపలకు విసిరాడు. వెళ్ళలేక వెళ్తున్నట్టు వెనుతిరిగాడు. చాంగ్ విసిరింది - రెండు తీపి రొట్టెలు.

అప్పటి నుంచి సాయంత్రం వరకూ, సాయంత్రం నుండి అర్థరాత్రి వరకూ ఒక పూర్తిరోజు ఆదుర్దాతో ఎదురు చూడటం నా పని అయింది. ఎంత గొప్ప రోజు ఇది! ఈ క్షణాల్లోని భావాలు వ్యక్తపరిచేందుకు మాటలు దొరకటం లేదు. మా దళాలు పోరాటం మొదలుపెట్టేందుకు ఎంత సమయం వుందో లెక్క గట్టాను.

సన్ ఇంటి వద్ద ఎంత మందికి దెబ్బలు తాకుతాయో అనే బాధ నాకు ఊపిరాడనివ్వటం లేదు. అప్పుడు నాకు నా జీవితాన్ని రక్షించిన దృఢమైన తెలివైన చాంగ్ గుర్తొచ్చాడు. తొలి కోడి కూసే సమయానికి గాయం తీవ్రంగా స్రవించి స్పృహ కోల్పోయాను. అపుడే గ్రామపు దక్షిణ దిశన పేలుళ్ళు వినిపించాయి. హేండ్ గ్రనేడ్స్ పేల్చిన శబ్దం అది! గ్రామం లోపల కూడా కాల్పులు మొదలైనాయి. మా దళాలు విజయవంతంగా ప్రాకారాన్ని పగలగొట్టి వుంటాయి - సందేహం లేదు. కిటికీ దగ్గరకు ఉరికి బయటకు చూశాను. దక్షిణం ప్రాకారంపైన హేండ్ గ్రనేడ్స్ సృష్టించిన మంటలు కనిపించాయి. కిటికీకి ఎదురుగా తెల్ల దెయ్యాలు, వాళ్ళ సైనికులు, సెక్యూరిటీ పోలీసులు తత్తరపాటుతో తుపాకులు పట్టుకుని అటూ ఇటూ పరుగులెత్తడం కనిపించింది. కొందరైతే బట్టలు కూడ వేసుకోలేదు. నన్ను బాగా ఆశ్చర్యపరిచింది ఏందంటే - సన్ ఇల్లు పేలిపోవటం. మంటలు ఆకాశాన్ని అంటాయి. కలప, గడ్డి గాలిలో లేచాయి. తెల్ల దెయ్యాల కీలక స్థావరం మంటల పాలయింది. ఇక భయంలేదు - ఇదంతా చాంగ్ కృషి ఫలితమే.

జైలు తలుపులు తెరచటం నన్ను ఆనందపరచింది. రెండవ విభాగపు నాయకుడు కాళ్ళీడ్చుకుంటూ నా వద్దకు వచ్చాడు. అతని వెనక నుంచి చాంగ్ ఎగిరి నా చేతుల్లో పడ్డాడు. "మామ - నీకేం కాలేదుగా! బాగానే వున్నావ్ కదూ!" అని రొప్పుతూ అన్నాడు.

"అవును నేను నిజంగా బతికే వున్నాను. విప్లవ అంతిమ విజయం చూడనిదే నేనెలా చనిపోతాను" అతని ఆనందాన్ని పంచుకుంటూ అన్నాను.

రెండో విభాగపు నాయకుడు నా చేతిని గట్టిగా పట్టుకొని అన్నాడు- "ఓల్డ్ హౌంగ్....ఓల్డ్ హౌంగ్....నువ్వు చాలా బాధలకు గురయ్యావు". తరవాత నా సంకెళ్ళు తొలగించి ఇద్దరు చెరోవైపు సాయం పట్టి నన్ను బయటకు తీసుకు వచ్చారు.

దాడి అంటే దీర్ఘ కాలం జరిగే యుద్ధం కాదు గదా! మేం గ్రామంనుంచి త్వరగానే వెనుతిరిగాం. వెదురు బొంగుల స్ట్రెచర్ మీద నన్ను పడుకోబెట్టారు. చాంగ్ నా పక్కనే నడుస్తున్నాడు. నేను నాయకుడ్నడిగాను. "సన్ ఇల్లు అంత బలమైన రక్షణలో వున్నపుడు ఎలా పేల్చేశారు?" చాంగ్ వైపు చూసి నవ్వుతూ "అదంతా చాంగ్ గొప్పతనమే. ఒక నమ్మకస్తుడైన రైతును పట్టుకొని-సన్ ఇంటికి తోలు

యుద్ధం

— వరీనియా

ఇస్కూల్లంట మజ్జేన్నం బువ్వలు మానీసినపుడుకాంచి - నీను బడి మానీసినాను. అప్పుడికి నాకు అచ్చరాలన్నీ యెలిపోవొచ్చును. కా గుణింతమూ వొచ్చును. సిన్న, సిన్న పేర్లు....సదివీసోడ్ని కూడబలుక్కోని! సాల్దా? సాల్దట. "ఎద్దు నాగున్నావు, నాలుగె క్లాసు కెలి పోవొచ్చినా వేటీ రావు....ఎదవకానా" అని మా సెలేను మేస్టురిగోరు తిట్టీవోరు. అతగాని తిట్లు పడనేక - యిస్కూలు మానిద్దమనుండీది. మజ్జేనం బువ్వ నాగిసీది బడికి నన్ను.

సెలేను మేస్టురిగోరు ...వోరంకొక రోజొస్తారు. అసలకి, మా బడికి అయిదు కలాసులికీ అయిదుగురు మేస్టర్లున్నే - అందరొకపాలి రారు. రోజు కొకలే వొత్తారు. మమ్మల్ని మంద ఆసెత్తారు. ఒక మేస్టురిగోరు ...పెసిరెంటు గోరికి పేపరు భోగట్టాలు సదివినిపిత్తారు. ఉంకో మేస్టురిగోరు - అల యూనియన్లు పన్లు మీద తిరుగు

కెళ్ళే బండెడు గడ్డిలో చాంగ్‌ను, రెండు కిరోసిన్ సీసాలతో దాచాము...." పూర్తి గాక ముందే చాంగ్ అడ్డుపడ్డాడు.

"మామ, గెరిల్లాల్లో చేరేందుకు నాకు అర్హత వున్నట్లేనా?" అడిగాడు.

నేనేమి అని వుంటానో ఊహించండి. ఇన్ని రోజులుగా అతను చేసిన పనుల వల్ల, చాంగ్ పాత విప్లవ స్థావరంలో నివసించాడని, బాలదండులో బోన ఫైడ్ సభ్యుడని నిర్ధారణ అయింది. విప్లవమనే ఊయల్లో అతడు పరిపూర్ణ యోధునిగా వర్ధిల్లుతాడు. అందుకే ఏ మాత్రం వెనకాడకుండా - "నువ్వు ఇప్పటికే గెరిల్లావు" అని అన్నాను.

అది వాస్తవం. దళ కమాండర్ నా విజ్ఞప్తిని అంగీకరించి చాంగ్‌ను చేర్చుకున్నాడు. అప్పటినుంచి మాలో ఒక సభ్యుడు అదనంగా కలిసాడు. కాదు....ఇద్దరని చెప్పాలి. నన్నూ చాంగే రక్షించాడు.

డిశంబర్ 6, 1955

స్వేచ్ఛానువాదం - స్నేహమాల.

[పెకింగ్ ఫారిన్ లాంగ్వేజస్ ప్రెస్ ప్రచురించిన యాన్ ఆర్డినరీ లేబరర్ కథా సంపుటిలోని ఎ లిటిల్ గెరిల్లా కథకు స్వేచ్ఛానువాదం.]

తారు. మరో మేస్టుగోరు అప్పు యేట కెల్తారు. సెలేను మేస్టుగోరు వొయిద్యానికీ, కుర్రమేస్టు పీర్లేసుకీ తిరుగుతారు. రోజు కొకలు మాత్రం కంపల్సరీపుగా యెలిపోవొత్తారు- మా సెలేను మేస్టుగోరొత్తే-నాకు యిసారం! సెలేను మేస్టుగోరు సదువుకంటా పన్లెక్కువ సెప్తారు. 'ఒరే సిమాలుగా - సిగరెట్లు పట్రారా!' అంతారా? సిగరెట్లు తెచ్చిత్తానా? అప్పుడు జోవీ ల్తడిమీ 'అగ్గిపెట్లేదురా. అగ్గిపెట్టి పట్రారా?' అని మళ్ళా పంపుతారు. అలాపింటి పన్లు గాక - అతగాను వొయిద్యం సేత్తండు గదా, వొపులికి యే జబ్బొచ్చినా....సేలేనెక్కించేత్తాడు. అందికతగానికి సెలేను మేస్టుగోరంతాము. ఇస్కూలికొచ్చేముందు - యెవులికో సెలేను తగిలించీసొస్తాడు. 'అదయిపోయిందో, ఉందో సూసి....రారా' అని సిబ్బంకోపాలి తగుల్తాడు. మరి సదువెప్పుడవుతాది? మళ్ళా, యేట్రాదెదవకని తిడతాడు.

"అదిగాబడి మానీసి, సావుకారి గోరి అవులు కాయడం కమిరిపోరా" అని మాయమ్మ అనీది. మా అయ్యలేడు. కాస్టంకాడ అడి బుగ్గి పున్నాది. అడి సావు కర్సు అప్పు - మాయమ్మ పీక మీదున్నాది. నాను ఆవులు కాసీ, మాయమ్మ కూల్నాలీ సేసీ - ఆ సావుకారి అప్పు తీర్సియాలని మాయమ్మ ఆలోసన. నాకూ యిస్కూల్ల పన్లూ, మేస్టర్లు తిట్లు కంటా - అవులు కాత్తే బాగున్ను అనిపించీది. సుబ్బరగ మెరకలంట తిరగొచ్చు. సిరతా బిళ్ళా అట ఆడొచ్చు. యేటిల గెంతి, యీత కొట్టొచ్చు....అనుందేది.

మజ్జేనం బువ్వ - నాగిసీది బడికి నన్ను. ఇంటిల గెంజినీలే గదా. మజ్జేనం బువ్వ ఆపీసినారు - అప్పుడు బడి మానీసినాను.

బడొగ్గీగాని, సావుకారి ఆవులు కాపాలాకి అమిరిస్సింది మాయమ్మ నన్ను. అవులు కాయిడి మనీసరికి సర్దాపడి పోన్ను గాని - మా సావుకారి పనిమీద పని సెప్పి తినీసీవోడు. అవులిప్పక ముందు - నూతినీలు తోడమనీవోడు. అలింట్లోని నుయ్యిల నీరు ...పాతాళంలోకుండీది. తిన్ని సల్లింది - అరిగిపోయింది....నీరు తోడీసరికి! అప్పుడు అవులిప్పమనీవోడు. మల్ల సాయింత్రిం అట్నించి రాగానే, సాల్లోని కర్రపేలు వంటపంచకి మొయ్యమనీవోడు. ఆ తర్వాత ఇంటిలోని బస్తాలు దుకానంకీ, దుకానం కాడవి యింటికీ మొయ్యించీవోడు. ఇటికీ పున్నము నుంచి మళ్ళా ఇటికీ పున్నందాకా - పళ్ళు బిగువున పన్జేసినాను. అడి బాకీ తీరిపోనాది. సావుకారి కాడ పని మానీసినాను.

పెద్దోడ్ని అయిపోనాను గదా .... మా ఊరి బిగతలు కంబికెకం వుంతా వేత్రా అనడిగినారు. నానుండ లేదు. పెద్దోడ్ని అయిపోనాను గదా - అన్ని పన్లా వొచ్చును. మా యమ్మ మాత్తరం - 'సిన్నగుంటడివే' అంతా దింకా! యింకా సిన్న గుంటడ్నే? నవ్వరెవులేనా? బడిమాని త్తే పెద్దోలిమయిపోయినట్టగే గదా? అందికని, యింటిల వొట్టిని కూకోనుండోడినిగాదు. ఆకుతీతలకీ, పారపనికీ, దుక్కులుకీ .... అన్ని కూలిపన్లుకీ ఎల్లి - కూలి తెచ్చి మా యమ్మ కిచ్చోడ్ని! అప్పుడికీ మాయమ్మ నేను పెద్దోడి నయినట్టగ - నమ్మీదికాదు. ఇంకా, సిన్న పిల్లలకి సెప్పేన పన్లే, సెప్తాది. 'ఒరే సిమాలా - అలా అత్తని చేట అడిగి పట్రారా, యిల్లీ సీపురు తెమ్మిరా, కొట్టుకెల్లి - ఆ పావలా కిర్సనూని తేరా' .... యిలగ సిన్నపిల్లల పన్లు సెప్తాది. పోన్నే - అనుకుని నీనా పన్లన్నీ సేత్తన్ను. మా సెలేను మేస్టుri గోరు మాత్రం యీదిలో నెపుడేన కనబడితే: యేట్రోరె సిమాలుగా - బడి మానీసరికి గెడకర్ర నాగ పెరిగీసినావనీవోలు! నాకు వొల్లు పొంగిపోయేది!

ఈ మద్దిని మా యమ్మకి ఊష్టతొచ్చి మంచం పట్టింది. అప్పుడు మరన్నీటికీ నీనే ఆధారువు. అప్పుడన్నది మా యమ్మ - మా పొరిగింటి అత్తతోటి 'మా సిమాలు పెద్దోడ్నాగ సంపాదన సేత్తండు - సరిపోనాది గాని లేపోతే యీ జబ్బుకి నీను మంచం పట్టినందుకు యింటిల దీప్వేనా ఎలగపోనును" అని! మా యమ్మకి ఊష్టం రాగాన, సెలేను మేస్టురిగోర్ని పిల్దంకెల్నాను. అతగాను ముందు డబ్బు లడిగి, ఆ తర్వాత జబ్బేటన్నాడు. నాట్రోజులు కూలి - రొండ్రోజులు వొయిద్యంకి సాలింది కాదు. ఎలగయితేటి - నిన్నటి కొంచి మా యమ్మ తిరగాడతంది. గానీ్నరస మొదల్లే. నోరూ రుచిపోయి, వచ్చవచ్చ గుందట! కందిపప్పు పులుపొండితే బాగున్ను అన్నాదీ పొద్దు. అందికని, కందిపప్పు కొండంకనీ మా సావుకారి దుకానం కాడకెల్నాను. సాయింత్రిం పొద్దు గుంకిపోనాది. సీకటి సీకటి గుంది.

సావుకారి కొట్టుల కొరివిలాగ నై వెలుగుతంది. దుకానం దీనుసుల డొక్కులు మద్దిని - డొంకల్లోని బవురుపిల్లి నాగున్నాడు సావుకారి. అతగాని ముంగల కాటా - పిల్లి మీసం నాగ యేలబడి వున్నాదీ. నన్ను నూసి, అతగానే ముందు పలకరించాడు.

"యేందిరో సిమాలో? యేటి నల్ల పూసవయి పోనావు?" అనడిగాడు. మా సావుకారికి - నా మీద గురెక్కువ! గుంటడినని కూలి తగ్గించొచ్చు - పనెక్కువ సెయ్యించుకోవచ్చు గద - అందుకని. సావుకారి పలకరింపుకి -

"ఈ మద్దిని పొరుగూరు పనికెల్తన్నాను బావ్. తెల్లారగట్ల యెలిపోయి-మళ్ళ రాతిరికే వొత్తన్ను. అందికీ అలికిడి నేదు." అన్నాను.

"అఁహా! యేపాటి కిడతందిరో కూలి? మొత్తానికి గుంటడివయినా, గడుసోడి విరా గడించు, గడించురా సొమ్ము" అన్నాడు. అది ఎకసెక్కెమో, పొగడతో బోద పడ్నేదు నాకు .... అలగన్నాడు. అప్పుడు -

"మా నాటోలిమేటి గడిత్తాం బావ్. పూట బత్తిం పుల్లపెలుగోలిమి! దాని మీద జబ్బులు! మా యమ్మ కీ మద్దిని ఉఃస్టం. కూల్డబ్బుల్ని ఆ జబ్బు తినీసింది" అన్నాను.

"అర్రర్రే .... ఉఃస్ట మా? తగ్గిపోనాదా? డబ్బుల్నేవా? అప్పు కావాలేటి?" అని అడిగాడు. అప్పు యిత్తే - మల్ల నప్పు అమిర్సివొచ్చుగదా! అప్పుడు నీను - "తగ్గిపోనాది నెండి. నోరు రుసినేదంతే. కందిపప్పు పులుసొండాలని - పప్పూ, వుప్పూ కొండం కొచ్చాను." అని సెప్పి: రూపాయిచ్చి, అర్థపావు కంది పప్పు యిమ్మన్నాను. రూపాయి టిళ్ళందుకోకండా - నవ్వుతండు సావుకారి. ఎప్పుడికీ ఆపడు. యేటీ సావుకారికి - పిచ్చే ? తిపారమా? అనుకున్ను ! అప్పుడు -

"రూపాయికి కందిపప్పు పెసాదంకి సాల్దు. అంతొత్తాది. అర్దపావిచ్చీమనీ సరికి నవ్వొత్తంది." అన్నాడు.

"యేఁవీ? కేజీ యెంత బావ్?" అనడిగాను.

"మొన్నటిదాక కేజీ పదిరా! నిన్నటి కాంచి పదారు!" అన్నాడు.

"అదేటి? మొన్నటికి, నిన్నటికీ అంతోటొకపాలెలగ పెరిగిపోద్ది ?" అంతే -

"నీకు తెల్దునేరా." అనేసి మళ్ళా నవ్వుతండు.

"అదర మళ్ళా .... నవ్వుతాడు" అని ఆశ్చర్యపోతంతే -

"అన్నీటికీ పెరిగిపోనాయిరా ధరలు" అన్నాడు నవ్వు ఆపి.

"ఎందుకు బావ్?" అని కారణ మడిగితే -

"యుద్ద మవుతుందిరా .... అందుకూ." అన్నాడు.

"యుద్దమా? ఎవులెవులికి బావ్?" అన్నీను అడిగితే -

"నీకు తెల్దురా ...." అని మళ్ళా నవ్వబోనాడు. నాకు మా సెడ్డ కోపమెలిపోవొచ్చి —

"ఈపాలి నవ్వినావంతే - మనిద్దరికి యుద్దమయిపోద్ది" అన్నాను. అప్పుడు సావుకారీ —

"కప్ప యేటి తింతాదిరా?" అనడిగాడు.

"యేటి తింతాదీ, పురుగులా .... సిన్న సిన్న పరిగిలా" అన్నాను.

"ఔనా?" అని మళ్ళా నా సేత ఔననిపించీ -

"అయితే, మరి పామో ?" అనడిగేడు.

"కప్పల్నీ, సేపలా జెల్లల్నీ తింతా" దన్నాను. అప్పుడు సావుకారీ -

"కప్పకీ, పాముకీ యుద్దమవుతందిరా" అన్నాడు. అనీ -

"కప్ప కడుపులోని పురుగుని కక్కమంతాది పాము. నువ్వెవుడివి నా కడగ డంకి - అ పురుగు నా కడుపుల కలిసి పోనాదంతాదీ కప్ప! అయితే కాస్కో.... అని పామూ యుద్దమాడతన్నాయిరా. అదీ కత" అన్నాడు.

"కత రేటి... ఆసల్సంగతి సెబ్బూ" అనంతే -

"అమెరికావోడికున్నూ, యిరాకోడికున్నూ మద్దినిరా" అన్నాడు.

"అయితే! అలకాలకి యుద్దమయితే మనకేమి ? మంగ్రలామిడికీ, బారికి సోమిడికీ తగువయితే - సాకలి తిప్పడికీ నొప్పేలొత్తాదీ ?" అన్నాను.

"అందుకే నీకు తెల్దురా అన్నాను." అని సావుకారి 'నీకు తెల్దురా' అని అన్డం తప్పుగాదని తేల్చినాడు. తేల్చీసి -

"అ యుద్దంతోటి పెపంచకమంతా పీటముడి పడిపోనాదిరా! సరుకులు కదలడంకి.... సమురుసుక్క దొరక్కంటంది. అక్కడ బాంబులు పేల్తన్నాయి. యిక్కడ దరలు పేల్తన్నాయి. నీనేటి జేసీదీ ?" అన్నాడు.

"ఔను బావ్ ? అ దేశాల కాంచి తేవాల్సిన సరుకంతే రాదూ, కరువయి పోందని.... ధర పెంచీవొచ్చుగానీ; యిక్కడి వుప్పూ, పప్పుకీ పెంచేత్తారా ?" అనడిగితే, అ సావుకారి మా నిబ్బరంగా —

"మరందుకే అన్నాను నీకు తెల్దురా అని...." అన్నాడు.

"నిజమే. నాకేగాదు, నానాటోలికెవులికీ తెల్దు. తెలిత్తే నీలాటోలు నవ్వ గ్రలేటి ?" అన్నాను కోపమొచ్చి. మరన్నా ? అప్పుడు, సావుకారి - "ఒరే ! ఒక దానికి రేటు పెరిగితే, మరన్నిటికీ పెరగతాయి. యింజిను తిరిగితే సిన్న సిన్న సెక్రాలా తిరగవేటి ? అదిగాక — మీమేటి సరదాకి పెంచీసినామేటి ? సరుకులు దెచ్చీ లారీనోలు - ఆయిలు రేటు పెరిగిందని అద్దిలు పెంచినారు. అదిగాక, కొన్ని సరుకులికి కంపినీవోలు రేట్లు పెంచీసినారు. అయినా, సిల్లర, మల్లర అమ్ముతాం గదా - పర్లేదని పెంచలేదింకా ధరలు ! ఇంతలోకి - అడివిపందులు సెనగసేని మడిని దువ్వీసినట్టిగ - పుడ్ అరయ్యి వొకపక్క, యిజిలెన్సోలు యింకోపక్క, మరోడు మరోపక్క.... నా దుకానాన్ని దువ్వీసి కేసుల్రాస్సినారు. మరా కర్సులెక్క డ్నుండెట్టాల ?" అని తిరగ పెశ్నేసినాడు. నీనేటి సెప్తాను.

"అయితే బావ్ - ఆ యుద్ధమాగిపోతె పోని అప్పుడేనా తగ్గుతాయా దరలు" అని అడిగాను. అందుకా సావుకారి 'నీకు తెల్దునేరా' అన్లేదుగానీ, అలగ నవ్వినాడు. నవ్వి, నవ్వీ -

"పెరిగినోడు.... తరిగిపోగల్దేటిరా ? నువ్వు మల్ల సంటోడివై పాలు తాగ్గల వేటి ?" అనడిగీ మళ్ళ —

"అయినా, నీ కనుమాన మొద్దు. ఆ యుద్ధమింత బేగి అగదు. అదీగాక, యింకా ముదిరితే - పెపంచ యుద్దమయిపోద్దాట గూడా" అన్నాడు సరదాగా.

"అయితపుడేటవుతాదీ ?" అని నాను అడిగాను. అనుమాన మొచ్చి.

"యేటవుతాదీ. పెపంచంలోకి పెద్ద, పెద్ద మిల్లులా, పెద్దోలి భవంతులా, సంపదలా - బాంబులు పడి బుగ్గయిపోతాయి" అన్నాడు.

"అలగయితే - మన దేశంలోని పెద్ద, పెద్దోలి మిల్లులు మీదా, యిళ్ళ మీదా, సంపదల మీదా బాంబులు పడతాయన్నమాట" అనుకున్నాను లోపుని! అనుకునీ -

"అయితే - రూపాయికెంత ,పప్పొస్తే అంతిచ్చీ సావుకారీ బేగి" అని తొందరజేసాను. రూపాయికి పప్పు కొలిస్సి, పొట్లం సుట్టి, సేతిలెడుతూ -

"కాదేట్రా తొందరా ?" అనడిగాడు.

"బేగెల్లీ, యీ పప్పు నానేస్సి, దేముడికి పెసాద మెడతాను - దేముడా ! మా దేశం మిల్లులు మీదా, సంపదల మీదా బాంబులు పడించీవా అనీ ? మా నోటి కందని సంపదలుంతే యేమి, బుగ్గయితే మాకేమి ?" అనీసరికి - మా సావుకారి మొకంల నవ్వు మాసిపోనాది. కాటా ఒక పక్క కొరిగిపోనాది !

"ఒరె వెధవకానా - అవేం ఆలోసన్లురా. ఇంటిలో ఎలుకలున్నాయని, ఇంటిని కాల్సుకుంటామా ? సంపదల మీద బాంబులు పడి బుగ్గయిపోడం కాదు - ఆ సంప దలు నీలాంటోలికి సెందటంకి ప్రార్థించురా" అన్నాడు - ఎప్పుడెలి పోవొచ్చి మా మాటలిన్నాడో సెలేను మేస్టురిగోరు !

"నేను గతుక్కుమన్నాను. మేస్టురిగోరు సెప్పిన ముక్క బోదపర్చుకోని, యింటికాసి అడుగు లేసాను సెలేను. మేస్టురిగోరికి.

"వొత్తాను, మేస్టురిగోరో....!" అన్సెప్పి.

— × —

('9-2-91' "కథ పాఠకునికి దూరమవుతోందా ?" శీర్షకన 'శ్రీకాకుళ సాహితీ వేదిక' నిర్వహించిన చర్చ సందర్భంగా చదివిన కథ.)

రచన : 7-2-91

నవల - సీరియల్ :

రాగో

సాధన

(గత సంచిక తరువాయి)

15

పోలీసులను చితగ్గొట్టిన ఉత్సాహంతో గాలిలో తేలిపోతున్నట్టు హుషారుగా నడుస్తున్నాడు ఊగ్లే. భుజాన వేలాడుతున్న కొత్త 303 పదే పదే చేతితో తడిమి చూసుకుంటున్నాడు. మిగతా ముగ్గురు కూడా అంతకు తక్కువేమి లేరు.

దార్లో ఇక ఆ ఊసులొద్దని ఎన్నోసార్లు హెచ్చరిస్తు కూడ మళ్ళీ-మళ్ళీ గాండోయె నిన్నటి దాడి విషయం ఏదో ఒకటి మాట్లాడుతున్నడు. క్లేమోర్ మైన్ పేలినపుడు చెవులు ఎలా చిల్లులు పడ్డాయో జైని యాక్షన్‌తో సహా చెప్పుతుంటే జమే దారుగాడు నాలుక వెళ్ళబెట్టి గుడ్డెల్గులా ఎలా పడిపోయాడో టుగ్గె చేతులు, కాళ్ళు తిప్పుతూ భయంకరంగా వర్ణిస్తున్నాడు.

చక చక సాగిపోతున్న నలుగురు తటాలున జైని 'ఉష్ !' అంటూ చప్పుడు చేయొద్దన్న సైగతో సడెన్ బ్రేక్ పడ్డట్టు ఆగిపోయారు. జైని అటు వేలు చూపడమే తరువాయి కొత్త తుపాకి 'ఢాం' అని పేల్చాడు ఊగ్లే.

అః ! పడిపోయింది అని ఎగిరాడు టుగ్గె.

పడ్డట్టు పడి లేచి ఉరుకుతుంది కొండగొర్రె. ఒక్క ఉదుటున అక్కడికి పరుగెత్తిన నలుగురికి దారకట్టిన రక్తం కంటపడింది.

'తాకింది తాకింది దూరం పోలే' అంటూ వెనక్కి చూడకుండా పరుగందు కున్నాడు టుగ్గె.

'మీరు ఇక్కడే ఉండండి. ఇప్పుడే వస్తం' అంటూ ఊగ్లే కూడ ఆగకుండా పరిగెత్తాడు.

'ఐదు నిముషాలు గడిచేసరికి గాండోలో విసుగు ప్రారంభమైంది. ఎక్కడ తాకిందో ఏమిటో. అది అడవిలో పడితే దొరుకుడు కష్టమే' అనుకుంటూ వాచి చూసు కొని 'కూ' అంటూ పెద్దకేక వేశాడు. పక్కకు తిరిగి చూసేసరికి జైని కూడ మాయమైంది.

20 నిముషాల తర్వాత ముగ్గురు కామ్రేడ్స్ కొండగొర్రె కావడి మోసుకుంటూ వచ్చారు.

'తిరిగి వచ్చేటప్పుడు తీసుకపోదాం. తొందరగా దీన్ని యిక్కడే పెట్టండి. అపాయింట్ మెంట్‌కి టైం సరిపోదు ఉరకాలి' అని గాండో చెప్పడంతో కొద్దిగా లోపలికి పోయి పంచొత్కపు పొదల్లో బండల నడుమ పెట్టి ఈగలు వీపు పెట్టకుండా కళ్ళింగ ఆకులు నాలుగు కప్పారు. ఉల్గె, టుగ్గె, జైనీలు.

టైం సరిపోదని గాండో హెచ్చరిస్తుంటే ఆ నలుగురు ఉరుకులు పరుగులుగా ముందుకు కదిలారు.

*   *   *   *

గిరిజ ఫకీర్లతో సహా సీదో, మిన్కోలు గొర్రెచుట్టు చేరి 'ఇది ఆడా! మగా' అని ఒకరు 'చూడు, చూడు ఇక్కడ పొట్టలోనే తగిలిందని' ఒకరు కిలకిలమంటూ హడావిడి చేస్తున్నారు.

పలకరింపు లైపోయాయి. దాడిలో దొరికిన ఎస్. ఎల్. ఆర్ ను కాక్ చేసి చూస్తూ ముచ్చట్లు పెడుతున్న డివిజినల్ కమిటీ సెక్రటరీ తొందరగా కోయండి పేగులు తీయకుంటే చెడిపోతుంది' అన్నాడు.

'రెండ్రోజుల వరకు ఏం దోఖా లేదు' అంటూ డుంగ కోత కార్యక్రమం కానిస్తున్నాడు.

వంట బ్యాచిని రుషి హడావిడి చేస్తున్నాడు.

'ఎప్పుడు అసలు టైంకీ వస్తాడు వినోదన్నా' అంటూ డివిసిఎస్‌ను బనాయిస్తుంది సీదో.

"స్పెషల్ రెండు వాటాలు ఇస్తాం కానీ కొత్త తుపాకులు మాత్రం మా దళానికే ఉండాలన్నా" అంది మిన్కో.

'కానియ్యండి, కానియ్యండి పొద్దుపోవద్దు' అంటూ దళాన్ని హుషారు చేసి రుషి వినోదును తీసుకొనిపోయి దూరంగా కూచున్నాడు.

'భోజనాలు అయిన తర్వాత మీకు బయటి వార్తలు చెప్పాలంటే ఇపుడే కూచోవాలి. నేను చెప్పినంత సేపు ఎవరు కురుకడానికి వీల్లేదు. అలా అయితేనే చెప్పుతా. రేపు పొద్దున మీటింగ్‌ల మాత్రం ఈ విషయాలు అడగొద్దు' అంటూ వినోదు కాసేపు అందరిని ఆట పట్టించాడు.

'నేను సెంట్రీ నుంచి వచ్చేవరకు మాత్రం చెప్పడానికి వీల్లేదు' అంటూ డుంగ 'లేకపోతే నా సెంట్రీ అయినా మార్చండి' అన్నాడు.

చూశారా ! మరి వార్తలు చెప్పడం కుదరదు. ఆ తర్వాత మీ కమాండరే చెప్తుతాడు అన్న వినోదు "మన మీటింగ్ రేపు పెట్టుకుందాం" అంటూ సెల్ మీటింగ్ జరుపుకుందామని గాండో, గిరిజ, జైని, రుషిలతో నడిచాడు.

× × ×

ఉదయాన్నే దళ సమావేశం ప్రారంభమైంది.

కామ్రేడ్స్,

ఈ రోజు మావో వర్థంతి. మహోపాధ్యాయుడు మావోకు నివాళలు అర్పిస్తూ మన అమరవీరులందరికి శ్రద్ధాంజలి ఘటిస్తూ నిముషం మౌనం పాటిద్దాం అని వినోదు ప్రకటించగానే అందరు లేచి నిలుచున్నారు.

రుషి అటెన్షన్ చెప్పాడు

అమరవీరులకు జోహార్లు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం.

మార్క్సిజం - లెనినిజం — మావో ఆలోచనా విధానం ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్థిల్లాలి. వర్థిల్లాలి.

నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి.

ఉత్తర తెలంగాణా దండకారణ్య రైతాంగ ఉద్యమాలు వర్థిల్లాలి.

పోరాడేవానిదే ఎర్రజెండా.

నినాదాలలో ఆ ప్రదేశమంతా కాసేపు దద్దరిల్లింది. అందరూ తిరిగి సర్దుకూచున్నాక రుషి ప్రారంభించాడు.

కామ్రేడ్స్,

"మన ఉద్యమంలో త్వర త్వరగా వస్తున్న మార్పుల గురించి, అందుకను గుణంగా మన డివిసి తీసుకుంటున్న నిర్ణయాల గురించి మన దళానికి స్వయంగా చెప్పడానికి వినోదన్న వచ్చాడు. కనుక మన సమావేశంలో అదొక్కటే ఎజెండా. మన మిగతా ఎజెండా అంతా తర్వాత సమావేశంలో మాట్లాడుకుందాం" అంటూ ప్రారంభించమన్నట్టు వినోద్‌వైపు చూశాడు.

"కామ్రేడ్స్",

ముందుగా పోలీసులమీద అంబూష్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు మన డి. సి. తరుపున మీ అందరికి రెడ్ శాల్యూట్స్. చాలా క్లిష్టమైన సమయంలో మన ఫారెస్ట్ ఉద్యమానికి ఆయుధాలు సంపాదించడమేగాక ఉద్యమం ఒక మలుపు తిరగబోతున్న కాలంలో శత్రువు చొరవను దెబ్బగొట్టడంలో మీరు చేసిన అంబుష్‌కి చాలా ప్రాముఖ్యత ఉంది. మీరందరు చూపిన ధైర్య సాహసాలకి, ఉత్సాహానికి మిమ్ముల్నందరిని మరోసారి అభినందిస్తున్నాను.

పెచ్చు పెరిగిపోతున్న పోలీసు నిర్బంధం గూర్చి మీకు తెలుసు. శత్రువు చాలా కొత్త పద్ధతులు ఉపయోగిస్తున్నాడు. విపరీతమైన బలాల్ని దించుతున్నాడు. ఆ విషయాలన్నీ ఎప్పటికప్పుడు మీకు తెలుపుతూనే ఉన్నాము.

మారే పరిస్థితులకు తగినట్టు కొత్త కర్తవ్యాలు చేపట్టడానికి మనం ఎప్పుడూ తయారుగా ఉండడం కొత్త బాధ్యతలు నిర్వర్తించడానికి ఎప్పటికప్పుడు తగిన తర్ఫీదు పొందడము అన్నిటికంటే చాలా ముఖ్యం. ఆ దృష్టితోనే మన ఫారెస్ట్ కమిటీ మిలట్రీ క్యాంపులు నిర్వహిస్తుంది. ఆయుధాలు, తర్ఫీదు కూడ మెరుగుపర్చడానికి సైనిక విషయాలు బోధించే పత్రికలు-పుస్తకాలు అందించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. మన జ్ఞానం, పరికరాలు, ఆయుధాలు పెరుగుతున్న కొద్దీ మన కర్తవ్యాలు ఇంకా ఎక్కువగా కావాలనే డిమాండు కూడా పెరగడం సహజమే. ఉద్యమం రోజు రోజుకు పెరుగుతున్న దాని ఫలితమే ఇవన్నీ.

ఫారెస్టు ఏరియాలో కూడా ఆదివాసీ సంఘాలు, పార్టీ సెల్స్, గ్రామ రక్షక దళాలు ఊరూర పెరుగుతుండడం మీకు తెలుసు. వీటిని ఇంకా అన్ని గ్రామాలకు వ్యాపింపజేయాలి. ఉన్నవాటిని ఇంకా బలంగా పని చేయించాలి. యువకులందరికీ మిలట్రీ తర్ఫీదు అందించాలి.

మన ఉద్యమ ప్రభావం చాలా దూర ప్రాంతాలకు విస్తరించింది. ప్రజానీకంలో చాలా ఉత్సాహం వస్తుంది. మొత్తంగానే పీడిత ప్రజానీకంలో మిలిటెంట్ తత్వం పెరుగుతూ వుంది. పెరుగుతున్న ఈ విప్లవ పరిస్థితికి అనుగుణంగా మన నిర్మాణం విస్తరించి బలపడాల్సిన అవసరం ఈ రోజు మనముందుంది.

దళం దగ్గరినుండి ఎఫ్.సి. వరకు అన్నీ ఈ కర్తవ్యాల కనుగుణంగా ఇంకా పటిష్టం గావాలి. మనలో ప్రతి ఒక్కరం కొత్త బాధ్యతలని చొరవతో స్వీకరిస్తూ కష్టపడి పని చేస్తేనే ఈ కర్తవ్యాలు పూర్తిచేయ గలుగుతాం. ఆ స్పిరిట్‌లోనే మీ

దళానికి అప్పగించిన ఆంబూష్‌ను విజయవంతంగా పూర్తిచేసి మీ వంతు కర్తవ్యాన్ని నిర్వహించినందుకు చాలా సంతోషం.

మన డివిసిలోకి మరో సభ్యుణ్ణి కొత్తగా కో-ఆప్ట్ చేసుకోవాలనీ నిర్ణయించడం జరిగింది. మీ కమాండర్ కా॥ రుషిని డివిసి కోఆప్ట్ చేసుకుంటుంది. ఇది నేను చెప్పదలుచుకున్న మొదటి విషయం'' అంటూ వినోద్ ఆపేసరికి అందరి చూపులు రుషి మీద నిల్చాయి.

"రుషన్న డివిసికి వెళ్ళినా మా దళంలోనే ఉంటాడు కదా'' అన్నారు ఒకే సారి సీదో, ఫకీరలు.

"ఆఁ ! ఆఁ ! ఆ విషయానికే వస్తున్నాను. మీ దళంతోనే ఉండాలా. మీ కమాండర్‌గా కూడ అతనే ఉండాలా"! అంటూ రెండో విషయానికి ఉపోద్ఘాతం ప్రారంభించాడు వినోద్.

"ఆయన ఏ దళంలో వుంటాడన్నది తర్వాత ప్రశ్న. రుషిని డి.వి.సి.లోకి తీసుకున్నాక కమాండర్ ఎవరన్నది ముందు తేలాలి"—వినోద్.

'డివిసి అది కూడ అనుకొనే ఉంటుంది కదా. చెప్పండి' అన్నాడు ఫకీర.

'ఆదెలాగు చెప్పుతాం కానీ మీ అభిప్రాయాలు చెప్పండి ముందు' అన్నాడు వినోద్.

ఎవరూ మాట్లాడలేదు.

"ఊఁ ! ఊఁ ! చెప్పండి. మీరే మాట్లాడాలి" అని మళ్ళీ గుర్తుచేశాడు వినోద్.

అందరు గాండో వైపు చూస్తున్నారు.

"మాలోంచే అయితే కా॥ గాండోయే మా నెక్స్ట్ కమాండర్" అని గిరిజ సైలెన్స్ బ్రేక్ చేసింది.

"ఏమంటారు ! మీ అందరికీ ఇష్టమేకదా" అని వినోద్ అనేసరికి రెండో ఎజెండా ముగిసిపోయింది.

"మరి డిప్యూటీ సంగతి కూడ చెప్పండి" అన్నాడు రుషి.

అడిగిందే తడవుగా 'గిరిజక్కా' అంటూ కోరస్‌లాగా వచ్చింది సమాధానం.

"వెరిగుడ్ కామ్రేడ్స్! మీ దళం అందరు కూడా సరిగ్గా డివిసి నిర్ణయాలనే ప్రతిపాదించడం నాకు చాలా సంతోషంగా ఉంది. గాండో, గిరిజలు ఈ దళాన్ని రుషి ఉన్నప్పటిలాగే బాగా నడపగలరని మాకు నమ్మకం ఉంది. ఎప్పటిలాగే మీరంతా గట్టిగా పని చేయాలి".

"ఇక ఆయుధాల సంగతి. ఉత్సాహం కొద్ది మీరు అన్నారు గానీ ఎవరికి దొరికిన ఆయుధాలు వాళ్ళవే అనేది పార్టీ పద్ధతి గాదని మీకు కూడా తెలుసు. ఎఫ్.సి.తో సంప్రదించి ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపుదాం. మీ దళానికి మంచివి ఉంచాకే తక్కినవి తీసుకుంటాం."

"ఆయుధాల్లాగే అవసరాలరీత్యా కామ్రేడ్స్‌లో కూడ కొన్ని మార్పులు చేర్పులు అవసరం. మీ దళం నుండి ఒక డిప్యూటి కమాండర్ బయటకు రావాలి" అని నవ్వుతూ ఊరుకున్నాడు వినోద్.

'అందరిని ఒకేసారి మారిస్తే ఎట్లా. గిరిజక్కా ఇక్కడే ఉండాలి' అన్నాడు డుంగ.

'నేనూ అదే అనుకుంటున్నాను' అన్నాడు గాండో.

రుషి ఏదో అనబోయి ఆగిపోయాడు. ఆతృతగా రుషి ముఖంలోనికి చూస్తున్న సభ్యులందరు 'కమాండర్‌కు కూడ తెలియదా! అయోమయంలో ఉన్నాడ'నుకున్నారు.

"జైనక్కకు పార్టీ సభ్యత్వం యిచ్చి కొద్దిరోజులే అయింది కానీ విస్తరణలో భాగంగా పోతున్న కొత్త ఏరియాకి జైనిని డిప్యూటిగా పంపాలనీ డివిసి అనుకుంటున్నది. మీ అభిప్రాయం ఏమిటి?" అంటూ వినోద్ అసలు విషయం బయట పెట్టాడు.

'నేను అంతటి బాధ్యతలు చేయలేనేమో' అంటున్న జైని మాటలు 'మా అందరికి ఇష్టమే' అన్న సభ్యుల కోరస్‌లో మునిగిపోయాయి.

"జైనక్క డిప్యూటీగా చేయగలదు. కానీ కొత్త దళానికి పంపడమే మరో సారి ఆలోచించాలి. తెల్సినవాళ్ళు ఉండి గైడ్ చేస్తే జైని బాగానే చేయగలదు" అంది గిరిజ.

"ఆ సంగతి డివిసి దృష్టిలో ఉంది. మీరు జైనిని మాకు వదలిపెట్టండి" అంటూ నవ్వుతూ ముగించాడు వినోద్.

కనుబొమ్మలు చిట్లించి ఆలోచిస్తున్నట్టున్న రుషి ముఖం చిరునవ్వుతో వెలిగింది.

'లేద్దామా' అంటూ వినోద్ లేవగానే తెలుగు-మాడియాలో అంతర్జాతీయ గీతం పాడారు.

రుషి, గాండో భుజంపై చేయివేస్తూ "సాయంకాలమే విడిపోవడం మనం అపాయింటుమెంట్లు పెట్టుకోవాలి. అందరిని సదరుకోమని చెప్పు." అంటూ అందరు భోజనాలకు నడిచారు.

వీడ్కోలు చెప్పడానికి దళం అంతా లైన్లో నిలబడింది. కొత్త కమాండర్ గాండో వరుసలో ముందు నిలబడి 'సావధాన్' అన్నాడు.

వినోద్, రుషి, జైని, కర్ప, దుంగ దళం దగ్గర సెలవు తీసుకోవడానికి ఎదురు లైన్లో నిలబడ్డారు.

వినోద్ వరుసగా షేక్‌హాండ్ యిస్తూ కదులుతుంటే గిరిజ మాత్రం రుషి, జైనీలను కన్నార్పకుండా చూస్తూ రాగోను గుర్తు చేసుకుంటుంది.

'సబ్బెటోరుకు లాల్‌సలాం' (అందరికి లాల్‌సలాం) హోరు మధ్య ఆ అయిదుగురు కదలిపోతుంటే బోరుచివర నిలబడి దళం వాళ్ళు దాట మలుపు తిరిగే వరకు చేతులూపుతూనే ఉన్నారు.

(అయిపోయింది)

త్వరలో

రాగో

సృజన ప్రచురణగా

పుస్తక రూపంలో వెలువడుతుంది

స్మృతి :

జ్యోతక్క కోసం

చార్య

అక్కా ఎక్కడక్కా ?
ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి
ఒక్కసారి కనబడవూ !
నువ్వు మళ్ళీ కనబడ్తావని
అప్పాయింట్ మెంట్ స్థలాల్లో
ఎంతగా ఎదురుచూసానో ?
నువ్వు కనిపిస్తావని నా కళ్ళు
ఆశగా అటు చూస్తుంటాయ్
నువ్వు కనబడవు
నిరీక్షించీ, నిరీక్షించి వేసారిన కళ్ళు
మళ్ళీ మరునాటి నిరీక్షణకై
అవిశ్రాంత కృషి సల్పుతాయి
ఐనా నువ్వు కనబడవు
కానీ నా కళ్ళు నీ కోసం
ఎన్నెన్నో మార్గాల్నీ, స్థలాల్నీ
కంట్లో టార్చ్ వేసుకొని వెతుకుతుంటాయి
నిజం అక్కా
నేను బస్సులో వెళ్తుంటే
రోడ్డుపై ఎవరో నీలాగే కనబడితే
పరిగెత్తే బస్సులోంచి క్రిందికురికి
వెనక్కివచ్చి చూస్తే తీరా ఆ కన్పించిందీ నీవు కాదని తెల్సి
మరుక్షణం ఆవరించిన నా నిస్సత్తువను
నా జ్ఞాపకాల పుటల్లో నిక్షిప్తమై ఉన్న
నీ దరహాసం ఒక్కటే తొలగించింది నా స్మృతి పథంలో మెదిలి

నూతనో త్తేజం కల్గించింది రేపటి నిరీక్షణకై
ఎదురుచూసీ, ఎదురుచూసీ
ఇక నువ్వు నన్ను కలవ్వేమోనని
ఉత్తరానికి వీచే గాలినీ, పయనించే మేఘాల్ని
పిండిలాంటి వెన్నెల్ని పట్టుకొని ఒక్కసారి
నా గూర్చి మా అక్కకు చెప్పండీ
మా అక్క క్షేమమైన నాకు చెప్పమని బతిమాలాను
అక్కా ! ఆ గాలీ, వెన్నెలా మేఘాలు
చూసావా అక్కా నాతో "నువ్వో-
బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసావని
నాతో పరాచికాలాడుతున్నాయి
నిజంగా నువ్వు చనిపోయావా ? (చంపబడ్డావా ?)
నేనమ్మను నువ్వు చావలేదు. మరణం నీ దరికిరాదు
నా కోసం ఒక్కసారి రావూ ? తమ్ముడూ అని ఆప్యాయంగా పిలవ్వా
నా ముఖ దర్పణం
రేపటి భవిష్యత్తు సుందర చిత్ర పాటాల్ని
మనం కోరే మార్పు వెలుగురేఖల్ని
అందంగా, హృద్యంగా ప్రతిబింబిస్తోంది
ఒక్కసారి కళ్ళు తెరిచి చూడవూ
భౌతికంగా నువ్వు మాకు దూరమైనావేమోకాని
మానసికంగా కాదు
మా జవ జీవాల్లో ఏనాడో నీ స్థానం, పదిలం శాశ్వతం
అక్కా నీ అమరత్వం
మా చేతి ఎర్రజెండాగా ఎగురుతుంది
సుత్తీ కొడవలై బానిస సంకెళ్ళు బద్దలు కొడుతుంది
అక్కా నీవు మా పథ నిర్దేశకురాలివై
అరుణ తారవై ఆద్యంతం మాసాధీవే
నిన్ను చంపి మా ఆత్మ స్థయిర్యాన్ని

పేరులేని డైరీలో ఓ చిరిగిన పేజీ

జనం ఉప్పెతిని శత్రువు పల్లకి మొయ్యకు !

రుద్రయ్య

బ్రాహ్మల్లో కూడా మహానుభావులుంటారని మహాకవి ఆశ్చర్యపోయినట్టు పత్రికల సంపాదకీయాలూ మేధావుల చర్చల్లో కూడా సోషలిజం గురించి మహత్తరమైన మాటలు వినబడుతున్నాయి. సోవియట్ యూనియన్ కూలిపోడం అంటే కమ్యూనిజం ఓడిపోయి వ్యక్తిస్వేచ్ఛా పెట్టుబడిదారీ రాజ్యమూ గెలవడమే అనీ ఆ పాఠాలేవీ నేర్చుకోకుండా మార్క్సిస్టులూ లెనినిస్టులూ గుడ్డిగా తమని తాము సమర్థించుకుంటూ పాత సిద్ధాంతాలే పట్టుకు వేలాడుతున్నారనీ పత్రికలూ మేధావులూ కమ్యూనిస్టుపార్టీల్ని తప్పుపడుతున్నారు. మనిషి స్వేచ్ఛని ప్రేమిస్తాడనడంలో తప్పేమీలేదు. తీవ్రమైన స్వేచ్ఛా కాంక్షే లేకపోతే బానిస సమాజం ముందుకడుగేసేదా అసలు. సోవియట్ కమ్యూనిస్టు పాలకుల నియంతృత్వాన్ని భరించలేక సోవియట్

అరచేతిని అడ్డుపెట్టి పొడిచే పొద్దునీ
ఆపానని సంబరపడ్డాడు వాడు
వాడి సంబరం ఎంతోకాలం నిలువనీం
చరిత్ర పెంటకుప్పలపై పారేసి
ధూళీ దుమ్ముతో వాణ్ణి కప్పెడ్తాం
ఒరేయ్ నువ్వో జ్యోతిని చంపినా
ఆమె ఆశ ఆశయం లక్ష్యం
జన గుండెల్లో జాగృతమై వర్గచైతన్యాన్ని రగిలిస్తూ
నీ అంతంకై శ్రామిక వ్యవస్థ స్థాపనకై
అవిశ్రాంత పోరు సల్పుతూ
విప్లవం జిందాబాదని నినదిస్తుంటామని
అక్కా నీ అమరత్వంపై బాసజేసి
వాడికి తెలియజేస్తాం
నీ వారసత్వాన్ని కొనసాగిస్తాం

ప్రజలా రష్యనేతర జాతులా సోషలిజాన్ని కాలదన్ని వ్యక్తిస్వేచ్ఛ పుష్కలంగా వుండే పెట్టుబడిదారీ విధానాన్ని వరింవారని వీరి భావం. కాని వ్యక్తిస్వేచ్ఛ కోసం అన్చెప్పి మానవులు వేతన బానిసత్వాన్నే కోరుకుంటున్నారు అని చెప్పగలవా? అది చాలా అసందర్భం. అది అసలు వాస్తవం కానేకాదు. ఇంకోలా చెప్తే, వ్యక్తిగత ఆస్తికి పూచీపడడం అనే పేరుతో శరీర కష్టమూ ఒళ్ళూకూడా అమ్ముకోక తప్పని పరిస్థితుల్ని శ్రమని కొనేసి సంపదను దాచుకునే అవకాశాన్నీ గ్యారంటీ చేసి, ఓటు హక్కు వాక్ సభా పత్రికా స్వాతంత్రాలా రూల్ ఆఫ్ లా అనే మాయావరణాన్ని నిలబెట్టగలిగితే, పనిచేసేవాళ్ళు చావకుండా బతికుండేపాటి తిండిపెట్టి ఎంత చాకిరీ అయినా చేయించుకోవచ్చుననీ కొద్దిమంది మాత్రం బేఫికరుగా అన్నీ అనుభవిస్తూ కూచోవొచ్చుననీ, అలాంటి వ్యవస్థ ఎప్పటికీ శాశ్వతంగా వుండాలని మానవులంతా మనసారా కోరుకుంటున్నారనీ, అలాంటి స్థితికి విఘాతం తలపెట్టడం పరమ మూర్ఖమైన పని అనీ వీళ్ళు చెప్పదల్చుకున్నది. ఇంతకంటె అసందర్భం ఏముంటుంది? ఇది న్యాయాన్యాయాలు మంచి చెడ్డల ప్రశ్న కానేకాదు. విలువల సంగతి పక్కన బెట్టినా వాస్తవాలా సాధ్యాసాధ్యాల మాటేవిటి?

మంది కష్టంమీద కొందరే హాయిగా వుండడం సరైన రాజ్యవ్యవస్థే అనుకుంటే ఆ కొందరు మేమే ఎందుక్కాకూడదని అందరూ పోటీపడవలసిందేకదా. కొందరి సుఖం కోసం అందరమూ ఎందుకు కష్టపడాలని మొరాయిస్తే, పనిచేయించడానికి అప్పుడందర్నీ బలవంతంగానే వొంగబెట్టక తప్పదుకదా. కనక పోటీని అదుపులో వుంచడానికైనా అందరితోనూ పని చేయించడానికైనా ఆరెంటికీ కూడా ఏదో ఒకరకం బలవంతం వుండక తప్పదు. అదీ లాభాపేక్షే అని సింప్లిస్టిక్‌గా సమాధానం చెప్పుకున్నా, ఆ లాభాలు చేజిక్కించుకోడానికి కుత్తుకలు త్తరించుకోడం తప్ప మరోమార్గం వుండదు. కనక రాజ్యవ్యవస్థ ఎలాంటిదయినా బలవంతం పాలు ఎంతోకొంత తప్పదు. అదీ దోపిడిని కొనసాగించే రాజ్యం అయితే బలవంతం పాత్ర పని చేసేవాళ్ళందర్నీ అణిచివేసే రూపంలో వుంటుంది. అదీ దోపిడిని అరికట్ట

డానికి ప్రయత్నించే రాజ్యం అయితే ఎదిరించే వాళ్ళని అడ్డగించే స్థితిలో వుంటుంది బలవంతం. కనక మానవులకి యిప్పటివరకూ తెలిసిన రాజ్యపద్ధతుల్లో ఏది మేలైనది, లేదా యింతకంటె మెరుగైన రాజ్యపద్ధతికి ఏవైనా దారి దొరుకుతుందా, లేదూ అసలు రాజ్యం బెడదే లేకుండా వదిలించుకోడానికేది దారి అనేదే ఆలోచించే వాళ్ళని వేధించే ప్రశ్నలు. అంతేతప్ప, మనుషులు స్వేచ్ఛాప్రియులు గనక, స్వేచ్ఛ కావాలంటే దోపిడీ కొమ్ముకాసే రాజ్యమే వుండితీరాలి తప్ప మరోదారిలేదని లోకాన్ని దబాయించ బూనుకుంటే అది మేధావుల వెర్రితనమే అవుతుంది.

అధికారమంతా ఒకే పార్టీ చేతిలోవుండి అధికారంలో వున్నవాళ్ళు ఆడింది ఆట పాడింది పాటగా సాగడంవల్ల అనర్థమే దాపురించిందని సోవియట్ యూనియన్‌లోనూ తూర్పు యూరపులోనూ తేలిపోయింది. చైనాలో కూడా అదే జరగొచ్చు. కనక దోపిడీ అంతరించడమన్నది వట్టిమాట, కనీసం అప్పుడప్పుడు ప్రభుత్వాన్ని మార్చుకునే వీలయినావుంటే, నిర్ణయాలు చెయ్యడంలో సామాన్యుడికి ఏ అధికారవూ లేకపోయినప్పటికీ కొంత వూరటయినా ఉంటుంది గనక ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్న పెట్టుబడిదారీ విధానాన్నే నమ్ముకుందాం అంటున్నారు మేధావులూ పత్రికలూ. దరిద్రమూ, నిరుద్యోగమూ, ఆకలిచావులూ, వ్యభిచారమూ, నోరెత్తితే చావ మొత్తడం యివేవీ తప్పకపోయినాసరే ఎన్నికలూ వాటి పేరుతో మరిన్ని హత్యలు రిగ్గింగులూ, అప్పుడప్పుడు మంత్రులూ గవర్నర్లూ మారడాలూ అయినా ఉంటుంది గనక మనకి ప్రాప్తం ఉన్నదేదో దక్కిందేదో మొక్కుతూ యిలా బతకడమే మంచిది తప్ప మార్పుకోసం వెంపరలాడ్డం బుద్ధి తక్కువేగాక ప్రమాదం కూడానని సామాన్యుల్ని బెదిరించి బెల్లించి నయానా భయానా నచ్చజెప్పాలనే మేధావులూ పత్రికలూ మరోసారి గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఆస్తిపరులు వీళ్ళందర్నీ పెంచి పోషించేదీ ఈ పని చెయ్యడానికేకదా మరి! ఈ మేధావులికి తాము తింటున్నదంతా ఆస్తిపరులూ పాలకుల ఉప్పేనని గుడ్డి నమ్మకం. జనం కష్టంమీద బతుకుతున్నామని, ఒక్కక్షణం మోకాళ్ళమధ్య బుర్ర వొంచి, ఆలోచించుకుంటే యిలాటి వాదనలు చెయ్యగలుగుతారా!?

చర్చ :

'రేపటి సామ్యవాదం' పై మరికొంత

మనోరంజన్ మొహంతి

సోషలిజం మౌలిక ప్రతిపాదనల గురించి సాగుతున్న వర్తమాన సైద్ధాంతిక చర్చలో ప్రొఫెసర్ ఆర్. ఎస్. రావు రాసిన వ్యాసానికి ప్రాముఖ్యత ఉంది. ఆస్తి చట్రాలనూ, తత్సంబంధిత భావజాలాలనూ రద్దు చెయ్యడంలోనే సోషలిజం సారాంశం ఉన్నదని ఆయన గుర్తించారు. సోషలిస్టు స్వేచ్ఛ ప్రతిపాదనకూ, ఈ ప్రతిపాదనకూ మధ్య వైరుధ్యం ఉన్నదని నేననుకోవడం లేదు. ఐతే, నేను కొన్ని వివరణలు ఇవ్వదలచుకున్నాను.

మొదట, నా సిద్ధాంతం వ్యక్తి స్వేచ్ఛ భావన చుట్టూ కేంద్రీకృతమైనది కాదు. వ్యక్తికీ సమాజానికీ మధ్య ద్వైదీభావం పెట్టుబడిదారీ యుగపు సృష్టేనని నేను భావిస్తాను. వ్యక్తిని అతనికో, ఆమెకో ఉన్న అనేక బంధనాల నుంచి - వర్గ, కుల, లింగ, తదితర బంధనాల నుంచి విముక్తి చేయడమే సోషలిజం లక్ష్యం. ఈ బంధనాలను అన్నిటినీ కలిపి ఉంచేది వర్గ వ్యవస్థే గనుక వర్గానికి కేంద్ర స్థానం ఉంటుంది. సోషలిజం వ్యక్తి స్వేచ్ఛను గౌరవించదనే వాదనను నేను సవాలు చేసిన మాట నిజమే. అంతేగాక, నేను ద్వైదీభావాన్ని కొనసాగించే అన్ని సిద్ధాంతాలనూ సవాలు చేశాను. ఈ నేపథ్యంలో, స్వేచ్ఛ అంటే, నిర్దిష్టంగా పెట్టుబడిదారీ చట్రాన్ని తోసివేయడంగా వివరించడం జరిగింది. శ్రామిక ప్రజానీకపు స్వయం నిర్ణయాధికారానికి తగిన భౌతిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను కల్పించడమే స్వేచ్ఛ అని వివరించడం జరిగింది. ఆర్. ఎస్. రావు చెప్పే చట్రంలో స్వేచ్ఛ అంటే పెట్టుబడిదారీ ఆస్తి నిర్మాణాన్ని రద్దు చెయ్యడం. భావజాలాన్ని రద్దు చెయ్యడం. వర్గ, కుల, లింగ, తదితర ఆధిపత్యాల స్థానంలో సోషలిస్టు స్వేచ్ఛను స్థాపించే సోషలిస్టు చట్రాన్ని ఊహించడం. అంటే స్వేచ్ఛా భావనను అమూర్తంగా, అనిర్దిష్ట ప్రమాణాలతో చూడడానికి వీలులేదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు, దాని భౌతిక పునాదికీ, దాని భావజాల వ్యవస్థకు వ్యతిరేకంగా సాగే విప్లవపు నిర్దిష్ట దశ ప్రమాణాలతోనే స్వేచ్ఛా భావనను చూడవలసి ఉంటుంది.

ఇక్కడ ప్రత్యేకమైన శ్రద్ధ వహించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి : వ్యక్తికీ సమాజానికీ మధ్య ద్వైదీభావం ఉన్నదనే విషయాన్ని గతితార్కిక భౌతిక వాదం ఆమోదిస్తుందా లేదా? స్వేచ్ఛ గురించి మాట్లాడడానికి ఉదార ప్రజాస్వామిక వాదులకు మాత్రమే గుత్తాధిపత్యం ఉందా? వర్గ సంబంధాలను, కుల, లింగ సంబంధాల వంటి సామాజిక బంధనాలతో కలిపి చూడవలసి ఉందా లేదా ?

రెండవది - శ్రామికవర్గ నియంతృత్వానికి సంబంధించి ఆర్. ఎస్. రావు ఒక విలువైన అంశాన్ని ముందుకు తెచ్చారు. ఈ రాజకీయ రూపం ఆస్తి వ్యవస్థనూ, తత్సంబంధిత తప్పుడు చైతన్యాన్ని మార్చడానికి ఉద్దేశించినదనే విషయాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇక్కడ "శ్రామికవర్గ నియంతృత్వం గాని, ప్రజల నియంతృత్వం గాని ఏదయితే అది" అని నేను ఊరికే రాయలేదు. "ప్రజలు" అంటే చైనాలో నూతన ప్రజాస్వామిక దశలో వాడిన "ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం"లో ప్రస్తావించిన ప్రజలే. అంటే కార్మికులు, రైతాంగం, జాతీయ బూర్జువా వర్గం, పెటీ బూర్జువా వర్గం ఐక్యంగా ఉండే ఐక్య సంఘటన. దీన్ని ఆర్.ఎస్. రావు పొరపాటుగా అర్థం చేసుకున్నారు. కాని నా ప్రధాన వాదన ఏమంటే, సోషలిస్టు సమాజాన్ని నిర్మించే క్రమంలో పాటించవలసిన ప్రజాస్వామికీకరణ క్రమం గురించి. దీన్నే ఆర్. ఎస్. రావు చట్రంలో చెప్పాలంటే తరతరాలుగా వస్తున్న భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆస్తి వ్యవస్థలనూ, భావజాలాలనూ రద్దు చేసే క్రమంలో పాటించవలసిన ప్రజాస్వామికీకరణ క్రమం. లేదా మరో మాటల్లో చెప్పాలంటే, కార్మిక ప్రజాస్వామ్యం తనను తాను స్థాపించుకుని, లక్ష్యాన్ని సాధించాననుకుంటుందా, వాస్తవికంగా, ఆచరణాత్మకంగా ఎట్లా పని చేస్తుంది? నా ఉద్దేశ్యంలో, ఇక్కడే మనం, రాజకీయాల్లో, ఆర్థిక వ్యవస్థలో, సంస్కృతిలో ప్రజాస్వామిక క్రమాలను రూపొందించాల్సి ఉందనుకుంటాను. ఇక్కడ రెండు రకాలయిన ప్రాతిపదికలకు సమానమైన ప్రాధాన్యత ఉంది. మొదట, "ప్రజల" భాగస్వామ్యం ఉండే సంస్థలు ఉండాలి. "ప్రజలు" అంటే అసమ్మతినీ, వ్యతిరేకతనూ ప్రకటించడానికి అవకాశం ఉండే విప్లవకర వర్గాలు. రెండవది - దీనికి మార్గదర్శకంగా ఉండే భావజాల చట్రానికి పెట్టుబడిదారీ విధానాన్ని రద్దు చేసి సోషలిజాన్ని స్థాపించాలనే ఆలోచన పునాదిగా ఉండాలి. ఇక్కడే చాలమంది మార్క్సిస్టులు పెట్టుబడిదారీ పారిశ్రామిక విప్లవం గురించి, అత్యున్నత సాంకేతిక విధానం గురించీ,

ఉన్నత స్థాయి వినియోగ ఆర్థిక వ్యవస్థ గురించి తమ అభిప్రాయాలు చెప్పడానికి సంకోచిస్తారు. నిజానికి అన్ని సోషలిస్టు పాలనా వ్యవస్థలూ నూటికి నూరుపాళ్ళు అదే తరహా పారిశ్రామిక విప్లవ నమూనాను ఆమోదించాయి. ఆ నమూనా పెట్టుబడిదారీ విధానం, వలసవాదాల పెరుగుదలలో ముఖ్యమైన భాగం. ఈ నమూనా కొత్త అసమానతలను సృష్టించింది. పర్యావరణ వినాశనానికి దారి తీసింది. సాంస్కృతిక పతనానికి కారణమైంది.

అందువల్ల, మిగిలిన సోషలిస్టు వ్యవస్థలలోను, రానున్న సోషలిస్టు వ్యవస్థలలోనూ సోషలిస్టు ఆచరణ తన దైనందిన కార్యాచరణలో ఏమి చూపాలంటే, నియంతృత్వం కేవలం ఒక చిన్న దోపిడీ వర్గానికి మాత్రమేననీ, అత్యధిక ప్రజానీకానికి అది ప్రజాస్వామ్యమేనని చూపాలి. అంతర్గత ప్రయత్నాల వల్ల పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగే ప్రమాదం పెరుగుతున్నప్పటికీ, దాన్ని ఎదుర్కోగలిగినది ప్రజాస్వామ్యాన్ని అనుభవించే కార్మికులే. ఇక్కడ ఆర్. ఎస్. రావు ముందుకు తెచ్చిన ప్రధానమైన వాదన యు. ఎస్. ఎస్. ఆర్. విచ్ఛిన్నంతో స్పష్టమైంది. ఆ వాదన ఏమంటే, గతంలో బైటినుంచి ప్రమాదం ప్రధానమైనదిగా ఉండగా, ఈ మధ్య దశాబ్దాలలో సోషలిస్టు రాజ్యం లోపలి నుంచే, కమ్యూనిస్టు పార్టీ లోపలి నుంచే ప్రమాదం ఉంటుందనేది సమాన ప్రాధాన్యత గల అంశంగా రుజువైంది. దానికి జవాబు శ్రామికవర్గ నియంతృత్వం పేరుతో పెత్తందారీ ఆధిపత్యవాదం అమలు చేయడం కాదని నా అభిప్రాయం. అందరికీ భాగస్వామ్యం ఉండే ప్రజాస్వామిక సంస్థలు, సంస్థేతరమైన ప్రజాస్వామిక ఆచరణలు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా అన్ని రంగాలలో పోరాటం, పారిశ్రామిక విప్లవ అవగాహనను అధిగమించే సోషలిస్టు భవిష్యదాశను కల్పించడం ముఖ్యమైన అంశాలు. పెట్టుబడిదారీ విధానం పెంచి పోషించిన ఆస్తి వ్యవస్థనూ, భావజాలాన్నీ ఆ రకంగానే మార్చడానికి ప్రయత్నించవలసి ఉంటుంది.

సంస్మరణ

'చిరస్మరణీ'యుడు నిరంజన

'సాహితీమిత్రులు'

ఎనభైల తొలి రోజుల్లో 'చిరస్మరణ' నవల ద్వారా ఆయన తెలుగు పాఠకులకు పరిచయమయ్యారు. ఐదారేళ్ళ గడిచింతర్వాత ఆయన రాసిన మరొక నవల 'మృత్యుంజయుడు' సంక్షిప్త రూపంలో తెలుగు పాఠకులకు అందింది. అంతే. తెలుగు పాఠకులకు ఆయన గురించి అంతకన్న ఎక్కువ తెలిసే అవకాశం లేదు. కాని ఆ రెండు నవలలే ఆయనను చిరస్మరణీయుణ్ణి చేశాయి. మృత్యుంజయుణ్ణి చేశాయి. ఉద్వేగభరితంగా, ప్రేరణాత్మకంగా, ఆశావహంగా, ప్రజా ఉద్యమ దృక్పథంతో ఉండే నవలల జాబితాలో ఈ రెండు నవలలూ సమున్నతంగా నిలిచాయి. ఆ నవలలు రాసిన కన్నడ రచయిత ఎందరో తెలుగు పాఠకులకు అభిమాన రచయిత అయ్యారు. ఆయన కలం పేరు నిరంజన. అసలు పేరు కుళకుంద శివరావు. అంతకు ముందు వేర్వేరు పేర్లతో రచనలు సాగించినా, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట కాలంలో, పార్టీ నిషేధానికి గురయిన కాలంలో రచనా కృషి సాగించడానికి ఆయన పెట్టుకున్న పేరు నిరంజన. ఆయన తుదిశ్వాస కూడ తెలుగు నేలమీదనే హైదరాబాద్‌లో ఈ మార్చి 13న విడిచారు.

నిరంజన జీవితం నుంచీ, సాహిత్య కృషినుంచీ, సాహిత్య సృజన కోసం ఆయన చేసిన అన్వేషణల నుంచీ పాఠకులూ రచయితలూ నేర్చుకోవలసింది ఎంతో ఉంది. పేదరికం, అనారోగ్యం, అభిప్రాయ భేదాల వల్ల వైమనస్యాలు, పక్షవాతం వంటి తీవ్రమైన వ్యాధులు ఎన్ని చుట్టుముట్టినా ఆయన నోటిమాట ఆగిపోయేవరకూ, చెయ్యి రాయడం ఆగిపోయేవరకూ సాహిత్య సృజన చేస్తూనే ఉన్నారు. ప్రజా సాహిత్యం గురించి ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. 'సాహిత్యమే జీవితం'గా గడపడం అనేది ఆయన విషయంలో అక్షరాలా నిజమనిపిస్తుంది. అది అతిశయోక్తో, ఆడంబరపు మాటో కాదు. జీవితం కోసమే సాహిత్యం అని గుర్తించి, సామాజిక జీవనాన్ని మెరుగు పరిచేందుకే సాహిత్యాన్ని మరింత మరింత నైపుణ్యంతో శస్త్రంలా వాడాలని గుర్తించి సాహిత్య కృషి సలిపారు నిరంజన. ఆయన మృతితో

కన్నడ ప్రగతిశీల సాహిత్యం, భారతీయ ప్రజా సాహిత్యం ఒక మహాయోధుణ్ణి కోల్పోయాయి.

శివరావు 1924 జూన్ 15 న దక్షిణ కన్నడ జిల్లాలో పుత్తూరు తాలూకాలో కుళకుంద అనే చిన్న పల్లెటూళ్ళో పుట్టారు. ఎనిమిదో ఏట తండ్రి మరణించడంతో, తల్లి ఇతరుల ఇళ్ళలో పనిచేసి బతుకు వెళ్ళదీయవలసి రావడంతో అయన బాల్యం పేదరికంతో గడిచింది. చిన్నతనంలోనే హైవే మీద కాఫీ అమ్మి నాలుగు డబ్బులు సంపాదించవలసి వచ్చిన 'బాల్యం కాని బాల్యం' ఆయనది.

దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరులో 1935లో శివరామ కారంత్ నాయకత్వాన జరిగిన ప్రజా సమ్మేళనంలో శివరావు వాలంటీర్‌గా పాల్గొన్నారు. సామాజిక జీవితంలోకి ప్రవేశిస్తున్న తొలి రోజుల్లో ఆయన మీద స్వాతంత్ర్యోద్యమ ప్రభావం, గాంధీ, నెహ్రూల ప్రభావాలు ఉండేవి. నీలేశ్వరం హైస్కూలు విద్యార్థిగా ఆయన కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావంలోకి వచ్చారు. అప్పుడే పొరుగున ఉన్న కయ్యూరు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతాంగ ఉద్యమం నిర్మాణమవుతూ ఉండింది. శివరావు జీవితం మీద, దృక్పథం మీద రైతాంగ పోరాటం వేసిన ఈ ప్రభావం చాలా గాఢమైనది. తర్వాత రెండు దశాబ్దాలకు ఆయన ఈ ప్రభావాన్ని చిరస్మరణ నవలలో సజీవంగా చిత్రించారు.

దాదాపు ఆ రోజుల్లోనే ఆయన రచనా కృషి ప్రారంభమైంది. 1938 లో ఆయన పథ్నాలుగో ఏట ఆయన రాసిన మొదటి కథ ప్రచురితమైంది. హైస్కూలు చదువు ముగిసేనాటికే 'కిశోర' పేరుతో ఆయన దాదాపు పదిహేను కథలు ప్రచురించారు.

ఈ రచనా నేపథ్యంతో ఏదయినా ఉద్యోగం పత్రికారంగంలో సంపాదించవచ్చునని ఆశిస్తూ ఆయన మంగళూరు చేరారు. అప్పటికే నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ఆయనకు ఉద్యోగం అంత సులభంగా దొరకలేదు. చివరికి ఒక బహిరంగ సభలో ఆయన చేసిన ఉద్వేగభరితమైన ఉపన్యాసాన్ని విని 'రాష్ట్రబంధు' పత్రికాధిపతి ఆయనకు ఉపసంపాదకుడిగా ఉద్యోగం ఇచ్చాడు. నెలకు పన్నెండు రూపాయల జీతంతో ఆయన పాత్రికేయ వృత్తి ప్రారంభమైంది. క్రమక్రమంగా ఆయన రచనలు అప్పటి ప్రముఖ కన్నడ పత్రికలయిన తాయినాడు, జనవాణి, సంయుక్త కర్ణాటకల్లో కనబడసాగాయి. పాత్రికేయ వృత్తిలో ఇంకా మంచి అవ

కాశాల కోసం అన్వేషిస్తూ ఆయన 1945 లో బెంగుళూరు చేరారు. బెంగుళూరులో మొట్టమొదట నెలకు నలభై రూపాయల జీతంతో 'వాహిని పత్రిక' లో చేరారు. తర్వాత ఎక్కువ కాలం ప్రజామత పత్రికలో పని చేశారు.

అవిభక్త కమ్యూనిస్టు పార్టీ 1946 లో కన్నడంలో 'జనశక్తి' పత్రిక ప్రారంభించదలచినప్పుడు సహజంగానే శివరావుకు ఆహ్వానం అందింది. అప్పుడు జనశక్తి హుబ్లీ నుంచి వస్తుండడంతో ఆయన హుబ్లీ వెళ్ళారు. ఏడాది తిరగకుండానే పార్టీ నిషేధానికి గురయింది. జనశక్తి ప్రచురణ ఆగిపోయింది. అప్పుడు సాగుతున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని సమర్థిస్తూ రచనలు చేస్తూ, ఉపన్యాసాలిస్తూ శివరావు మూడు సంవత్సరాల పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా అజ్ఞాతవాసం చేశారు. ఆ రోజుల్లోనే ఆయన ఇప్పుడు ప్రఖ్యాతమైన 'నిరంజన' పేరు పెట్టుకున్నారు. 1951 లో అరెస్టయి రెండు సంవత్సరాల తర్వాత విడుదలయ్యారు.

సాహిత్యంలో అభిరుచి ఉండి, అప్పటికే ఎన్నో రచనలు చేసి ప్రచురణ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిని అనుపమతో నిరంజనకు 1950 లో పరిచయమైంది. ఆ పరిచయం గాఢమైన స్నేహంగా మారి, అభిరుచీ, జీవితధ్యేయమూ ఏకమై ఐదు సంవత్సరాల తర్వాత అనుపమ, నిరంజనలు దంపతులయ్యారు. (వైద్యురాలయిన అనుపమ రాసిన 'మాధవి' నవల కూడ తెలుగు పాఠకుల అభిమాన నవలల్లో ఒకటి). తల్లిదండ్రుల అనుమతి లేని ఈ వర్ణాంతర వివాహం స్నేహితుల సహకారంతోనే జరిగింది. అనుపమ గత సంవత్సరం మరణించారు.

1969 ఆగస్టు నుంచి ప్రారంభించి 1974 మార్చి నాటికి - అంటే నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే ఒంటి చేతిమీదుగా ఏడు సంపుటాల విజ్ఞాన సర్వస్వం 'జ్ఞాన గంగోత్రి' సంకలనం చేసి, తానే అచ్చు వేయించి పంపిణీ చేసారంటే ఆయన కార్యదక్షత, సృజనాత్మకత అర్థమవుతాయి.

1980-83 మధ్యకాలంలో సుమారు నాలుగు వందల దేశ దేశాల కథలు సేకరించి, అనువాదాలు చేయించి, సంకలనాలు సిద్ధం చేసి, నవ కర్ణాటక ప్రకాశన సంస్థ చేత ప్రచురింపజేయించిన కృషి కూడ ఆయనదే. ఈ ఇరవై ఐదు సంపుటాల ప్రణాళిక భారతీయ భాషలన్నిటిలోనూ అపూర్వ ప్రయోగం. ఈ ప్రణాళికలో మొదటి సంపుటం కన్నడ కథానికది కాగా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా దేశాల

కథానికలు ఇతర సంపుటాల్లో ఉన్నాయి. ఈ కథల ఎంపికలో నిరంజన తాత్విక దృష్టి, సహృదయత, సున్నితమైన, ఆర్ద్రమైన భావోద్వేగం కనబడతాయని కన్నడ సాహిత్య విమర్శకుల అభిప్రాయం.

ఈ రెండు బృహత్తర ప్రయత్నాలు వాటికవే గొప్పవి కాగా, ఆయన మరణాంతకమైన అనారోగ్యం మధ్య ఈ ప్రయత్నాలు సాగించడం ఇంకా గొప్ప విషయం. బాల్యంలోని కష్టాలు, యవ్వనంలోని సంఘర్షణలు నిరంజన ఆరోగ్యాన్ని మధ్యవయసు నాటికే దెబ్బతీశాయి. 1971 లోనే అంటే యాభై ఏళ్ళు కూడ నిండకుండానే ఆయన జీవితంలో సంధ్యాకాలం ప్రారంభమైంది. మైసూరు విశ్వవిద్యాలయ సెనెట్ సమావేశంలో ఉపన్యసిస్తూ ఆయన కుప్పకూలిపోయారు. ఆయనకు పక్షవాతం ఉందని తేలింది. మూడు రోజులపాటు ఆయన చావు బతుకుల మధ్య ఊగిసలాడారు.

క్రమక్రమంగా వైద్యచికిత్సతో, శుశ్రూషలతో ఆయన తేరుకున్నారు గాని అప్పటినుంచి మరణించేవరకు, రెండు దశాబ్దాల పాటు ఆయన గడిపిన జీవితం అరువు తెచ్చుకున్న జీవితం లాంటిదే. గత కొద్దికాలంగా ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వస్తోంది. మాట పోయింది. కదలిక పోయింది. మృత్యుముఖాన ఉన్నానని, ఏ క్షణమైనా మృత్యువు తనను కబళించవచ్చునని తెలిసి ఉజ్వల రచనా కృషి సాగించిన ఆస్ట్రోవస్కీ లాగనే నిరంజన కూడ ఈ ఇరవై సంవత్సరాలలో అపారమైన కృషి చేశారు. జ్ఞాన గంగోత్రి ఏడు సంపుటాలు, విశ్వకథాకోశ ఇరవై ఐదు సంపుటాలు, మృత్యుంజయ నవల, ఒక కథా సంకలనం, ఒక నాటకం, ఒక జీవిత చరిత్ర, వేర్వేరు రచనలు నాలుగు పుస్తకాలు, ఒక పుస్తకం అనువాదం ఈ కాలంలో ఆయన వెలువరించినవి.

మొత్తంమీద ఆయన రచనలు - కథా సంకలనాలు - 9, నవలలు - 25, నాటికలు - 3, జీవిత చరిత్ర 1, స్కెచ్‌ల సంకలనాలు - 7, రాజకీయ చర్చ - 1, ఇతర భాషా రచనల అనువాదాలు - 10, జ్ఞాన గంగోత్రి సంపుటాలు-7, విశ్వకథాకోశ సంపుటాలు-25. ఇవి కాక కనీసం మూడువేల పేజీల అముద్రిత రచనలు ఉండి ఉంటాయని 1982లో వేసిన అంచనా. గోర్కీ అమ్మ, ఆత్మ కథలను కన్నడంలోకి ఆయనే అనువదించారు.

ఆయన సాహిత్య జీవితంలో ప్రధాన ఘట్టాలుగా చెప్పదగిన నవలలు మూడు. విమోచన (1953), చిరస్మరణ (1955), మృత్యుంజయ (1976). విమోచనలో నాయకుడి వ్యక్తిత్వం రూపొందడంలో సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రాబల్యం, ధనవంతుల గర్వం, పేదవారి కష్టాలు, ఎర్రజెండా కింద కార్మికుల ఐక్యత మామూలుగా చిత్రించబడ్డాయి. ఒక రకంగా కన్నడ సాహిత్యంలో ప్రగతిశీల ధారకు నిరంజన ఆద్యుడని చెప్పగలిగేది ఈ నవల ద్వారానే.

చిరస్మరణలో కయ్యూరు రైతాంగ యోధులు అప్పు, చిరుకండ, అబూబ్ కర్, కు ఞంబులు సాగించిన విప్లవ కృషిని, మృత్యుంజయుడులో నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ మెనెప్టా సాగించిన కృషిని ఆయన అద్భుతమైన శైలిలో చిత్రించారు.

కన్నడ సాహిత్యసీమలో ప్రగతిశీల రచనలకు ఆద్యుడు, నాయకుడు కావడం మాత్రమేగాక ఆయన ప్రతి కొత్త ఆలోచనకూ స్వాగతం పలికారు. కన్నడంలో దళిత సాహిత్యోద్యమానికి సహాయ సహకారాలందించారు. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి ఏర్పాటు గురించి ఆసక్తి కనబరిచారు.

నిరంజన శివరావుగా రచనలు సాగించిన కాలంలో రాసిన కథ 'ఎణ్ణె! చిమణి ఎణ్ణె' రాష్ట్ర బంధులో అచ్చయింది. ఆ కథ అచ్చువేసినందుకు సంపాదకుడిపై విచారణ నడిచింది. బ్రిటిష్ కలెక్టర్ సంపాదకుణ్ణి ఇటువంటి కథలు వేయగూడదని హెచ్చరించాడు. 1975-76ల్లో ఈ కథను పునర్ముద్రించాలని 'అరుణ' పత్రిక సంపాదకుడు ప్రయత్నిస్తే ప్రభుత్వం అనుమతించలేదు!

నాలుగువేల ఏళ్ళనాటి ఈజిప్టు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన మెనెప్టా గాని, నాలుగైదు దశాబ్దాల కింద భూస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడిన కయ్యూరు రైతాంగ యోధులుగాని ఎట్లా మృత్యుంజయులూ, చిరస్మరణీయులూ అయ్యారో, బ్రిటిష్ ప్రభుత్వానికీ, "స్వతంత్ర" భారత ప్రభుత్వానికీ కూడ రుచించని రచనలు చేసిన నిరంజన కూడ అట్లాగే చిరస్మరణీయుడు, మృత్యుంజయుడు.

నిరంజనను సృజన సవినయంగా సంస్మరించుకుంటున్నది. ఆయన వదిలి వెళ్ళిన కృషిని కొనసాగించడమే ఆయనకు నివాళి.

సంస్కృతి

కె.జి. కన్నాభిరాన్

కొత్త సంవత్సరం ప్రారంభమై పట్టుమని పదిరోజులైనా కాలేదు. అది జనవరి 10వ తేదీ రాత్రి 10-45 నిమిషాలు. స్థలం : నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్. హైదరాబాద్‌లో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న వైద్య సంస్థ అది. ఇప్పుడు చెప్పబోయే ఉదంతానికి దర్శకుడు వరంగల్ జిల్లా పోలీసు సూపరెంటిండెంట్. ఆయన వైద్య విద్యను అభ్యసించి పోలీసు వృత్తిని స్వీకరించాడు.

ఇందులోని నాయిక ఒక మహిళా పోలీసు అధికారి. ఇండియన్ పోలీసు సర్వీసులోకి ప్రవేశించిన తర్వాత ఆమె తన తొలి సాహసిక కార్యక్రమానికి సంసిద్ధురాలై వుంది. ఆమె కారు ఆ సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కి రివ్వున దూసుకుపోతున్నది. వెనక రెండు జీపులు వస్తున్నాయి. వాటిలోని మనుషులు ముఖాలకు ముసుగు లేసుకున్నారు. చేతుల్లో స్టెన్‌గన్‌లున్నాయి. ఆమె తన గమ్యాన్ని సకాలంలోనే చేరుకుంది. అంతబాగా కారు నడిపినందుకు ఆమెకు చాల సంతృప్తి కలిగింది. చేతులో స్టెతస్కోపుతో కారులో నుంచి దిగింది. ఒక డాక్టరుగా వేషం వేయాలంటే నిజంగా స్టెతస్కోపు అవసరమా ? ఆమె ఆ ఆసుపత్రిలోకి ప్రవేశించింది. బంజారా వార్డులోని 23వ నెంబర్ రూంలోకి తిన్నగా వెళ్ళింది. ఆ రూంలో మంచంమీద ఒక రోగి పడుకొని వున్నాడు. అతని కుడిచేతికి ప్లాస్టర్ వేసివుంది. అతను గద్దర్ నాయకత్వంలోని జననాట్యమండలి సభ్యుడు. పేరు సంజీవి. స్వయంగా గాయకుడు. అప్పుడు సంజీవి లుంగీ కట్టుకొని పడుకొని వున్నాడు. గదిలో అడుగు పెట్టిన దొంగ డాక్టర్ ఒక్క ఉదుటున సంజీవిని లేవమని గదమాయించింది. తాను నిజంగా డాక్టరేనని భ్రమ కలిగించడం కోసం కేస్‌షీట్ తీసి పరిశీలించింది. అందులో ఆ రోగి చేతికి ఫ్రాక్చర్ అయినట్లుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న డ్యూటీ నర్సు వచ్చిన వ్యక్తి డాక్టర్ కాదని గమనించింది. రోగిని బైటకు తీసుకెళ్ళడానికి వీలు లేదని గట్టిగా చెప్పింది. అయితే దొంగ డాక్టరు వెంట ఇద్దరు కండలు తిరిగిన వాళ్ళు వున్నారు (వాళ్ళిద్దరికీ ప్రభుత్వ ఖజానా నుంచే కిరాయి చెల్లించి వుంటారు). వాళ్ళు రోగిని మంచంమీద నుంచి ఈవతలికి గుంజారు. దొంగ డాక్టర్ తనచేతి బ్యాగ్‌లో

నుంచి రివాల్వర్ తీసి, మనకు హిందీ, తెలుగు, తమిళం చిత్రాలలో ఇటువంటి ఘట్టాలలో వినిపించే డైలాగులు వంటివి నాలుగు వదిలింది. సినిమాలను వాస్తవ జీవితం అనుకరించిన కొన్ని సంఘటనలలో ఇదొకటి. అంత చలిలోనూ సంజీవిని చొక్కా కూడా వేసుకోనివ్వకుండా వాళ్ళు బలవంతంగా గదినుంచి బయటకి లాక్కొచ్చారు. గేటు దగ్గర సెక్యూరిటీ అధికారి దొంగ డాక్టర్‌ను ఆపాడు.

"మేడమ్ ! ఆసుపత్రి నుంచి డిస్చార్జి చేయందే రోగిని ఇలాగ తీసుకెళ్ళకూడదు. ఆయన కనబడకపోతే అందుకు పూచీ మాదే అవుతుంది".

"నేను ఒక పోలీసు అధికారిని. ఈ రాష్ట్రంలో బోలెడంత సాహసకృత్యాలు చేయవచ్చునని చెప్పారు కాబట్టే నేను ఈ రాష్ట్రాన్ని ఎంచుకున్నాను. ఇక్కడ పోలీసు నేరాలు పౌర నేరాలతో పోటీ కూడా పడుతున్నాయట ! నిజానికి పౌర నేరాల రేటును మా వాళ్ళు ఎప్పుడో అధిగమించారట. ఇది నా మొట్టమొదటి పెద్ద బాధ్యత. అడ్డులే" అని ఆ యువ మహిళా పోలీసు అధికారి గద్దించింది.

"కాని ఈ వ్యక్తికి వైద్య సదుపాయాలు అవసరం. పోలీసు కస్టడీలో ఉంటే అవేవీ లభించవు కదా ?".

ఆ సెక్యూరిటీ అధికారి మాటలకు మహిళా పోలీసు నవ్వింది. "నీకా భయం అక్కర్లేదు. వరంగల్‌లోని మా బాస్ డాక్టరే. వైద్యవృత్తి స్వీకరించడానికి వృత్తి నియమావళి ప్రతిబంధకం కావడంతో ఆయన పోలీసు వృత్తి స్వీకరించాడు. ఆయన ఐ.పి.ఎస్. అధికారి".

సెక్యూరిటీ అధికారి ఆ మాటలకు చలించలేదు, లొంగిరాలేదు. అందుకని బయట జీపుల్లో వున్న సాయుధులు రంగంలోకి ప్రవేశించారు. సంజీవిని గుంజుకుపోయి జీపులో పడేశారు. పోతూ పోతూ నక్సలైట్ నినాదాలు చేశారు. ముసుగులు ధరించిన ఆ సాయుధులు వేసుకున్న ఉన్ని వస్త్రాలు జీపులోని రోగికి కొత్త వెచ్చదనాన్నిచ్చాయి. ఈసారి గమ్యం వరంగల్.

వరంగల్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎక్కడో లాటిన్ అమెరికాలో జరిగినట్లు మనం పత్రికల్లో చదివే సంఘటనలు ఎప్పుడూ ఇక్కడ వరంగల్ పోలీసుల పుణ్యమా అని జరిగిపోతుంటాయి. అక్కడ జరిగేటటువంటి సంఘటనలే ఇక్కడ కూడా ఎందుకు జరుగుతాయో ఇతర రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాల విద్యార్థులు పరిశోధనాంశంగా తీసుకోవచ్చు. అయితే ఇక్కడ నొక్కి-

చెప్పాల్సిన విషయం ఏమిటంటే లాటిన్ అమెరికాలో అధికార యంత్రాంగం ఎట్లా పని చేస్తున్నదో పోలీసు యంత్రాంగం ఇక్కడ అలాగే పని చేస్తున్నది. అన్నిటి కంటే భయంకరమైనదది. మరో రెండు మూడు గంటల్లో ఆ మహిళా పోలీసు అధికారి, ఆమె వెంట వున్న మనుషులు వరంగల్ పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం చేరుకున్నారు.

వరంగల్ పోలీసు సూపరింటెండెంట్ ముందు సంజీవిని హాజరు పరిచారు. ఆ సూపరింటెండెంట్ ఒక పెద్ద టేబుల్ ముందు కూర్చొని వున్నాడు.

ఆ యస్పీ తన కుడివైపున కూర్చున్న సీనియర్ పోలీసు అధికారివైపు చూస్తూ, "సర్, నేను ఇందాక చెప్పిన గుర్తు తెలియని నక్సలైటు వీడే. ఇట్లాంటి గుర్తు తెలియని నక్సలైట్లు రాష్ట్రంలో చాలమంది వున్నారు. 1969 నుంచి నక్సలైటు ఉద్యమాన్ని అణచివేయడంలో మన ముందు తరం పోలీసు అధికారులు ఇటువంటి 'గుర్తు తెలియని నక్సలైట్'లను గుర్తించడంలో విఫలమయ్యారు. ఈ మాట చెప్ప వలసివచ్చినందుకు చాల విచారిస్తున్నాను. ఇప్పుడు మనం మాత్రం గొప్ప విజయం సాధించాం. నిజానికి మనం గుర్తు తెలియని నక్సలైట్లను చాలమందినే కాల్చిపారేశాం.

"ఓ రెండేళ్ళక్రితం జరిగిన ఒక సంఘటన. ఒక పోలీసు ఇనస్పెక్టరు అప్పట్లో గొలుసు దొంగతనం చేసిన ఒక వ్యక్తి గురించి విని అతనిని లక్సెట్టి పేటలో పట్టుకున్నాడు. అతనిని కోర్టులో హాజరు పరిచాడు. ఫస్ట్‌క్లాసు మెజిస్ట్రేట్ అతనిని జ్యుడిషియల్ కస్టడీకి పంపించాడు. కరీంనగర్ జిల్లా మందమర్రి ప్రాంతంలో పని చేస్తున్న ఆ ఇనస్పెక్టర్‌కి ఈ వ్యక్తి గుర్తు తెలియని నక్సలైటని అనుమానం వచ్చింది. వెంటనే సొంత ఖర్చులమీద ఒక న్యాయవాదితో మాట్లాడి బెయిల్‌కు దర ఖాస్తు పెట్టించాడు. సరే, అతను బెయిల్ మీద విడుదలయ్యాడు. అతనిని తన జీపులోనే మందమర్రి తీసుకొచ్చాడు. మర్నాడు ఒక గుర్తు తెలియని నక్సలైటు 'ఎన్‌కౌంటర్'లో పోయినట్లు పత్రికల్లో వార్త వచ్చింది! అటువంటి అనేక సంఘ టనలలో ఇది ఒకటి మాత్రమే.

ఆ ఇద్దరు పోలీసు అధికారుల మధ్య సాగుతున్న సంభాషణ వారి ఎదురుగా వున్న వ్యక్తికి రుచించలేదు. అప్పటికే తూటా దిగిన తన శరీరం ఆ వరంగల్ పట్టణంలో ఏ చౌరస్తాలోనో పడివున్నట్లు అతనికి కళ్ళముందు ఓ మృత్యు దృశ్యం కదలాడుతోంది.

" మా రికార్డుల ప్రకారం నువ్వు ఒక గుర్తు తెలియని నక్సలైటువి చెప్పు. నీ పేరేమిటి".

"అయ్యా, నేను గుర్తు తెలియని నక్సలైట్‌నని ఎలా అంటారు? గుర్తు తెలియని నక్సలైట్ అని ప్రత్యేకించి ఏమైనా గుర్తులుంటాయా?"

"మమ్మల్ని ఇంటరాగేట్ చెయ్యకు. నీ నుంచి సమాధానం ఎలా రాబట్టాలో మాకు బాగా తెలుసు." తమకు తెలిసినదేమిటో గుర్తు చేయడానికా అన్నట్లు ఆ ప్రక్కనున్న మరొకడు బాచిపెట్టి సంజీవి చెంపమీద కొట్టాడు. ఆ దెబ్బకి తూలి, పడబోయిన సంజీవి ఎలాగో నిలతొక్కుకున్నాడు.

ఎస్పీ పగలబడి నవ్వాడు. ఇంటరాగేషన్ కొనసాగించాడు. "చెప్పు నువ్వేం చేస్తుంటావు!"

రోగి సమాధానం చెప్పాడు-"నేను పాటలు పాడతా. ఈ దేశంలో జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాల గురించి, అణచివేతకు గురై అణగారిపోతున్న బతుకుల గురించి, పాలకులు తీర్చలేని వాగ్దానాల గురించి, ఎన్నికలప్పుడు, అంతకుముందు, ఆ తర్వాత రాజకీయ నాయకులు చేసే వంచన గురించి పాటలు పాడతా".

"సర్, చూడండి సర్. నేను చెప్పానుగా. వాడు నక్సలైట్. నేను చూసిన మొదటి సజీవ గుర్తు తెలియని నక్సలైట్ వీడు! మామూలుగా మనం ఎవడినైనా కాల్చిపారేశాక వాడు చచ్చాకే గుర్తు తెలియని నక్సలైటని గుర్తిస్తాం. అప్పుడు మనం ఆ శవం పక్కన కొన్ని నాటుబాంబులు, సంచిలో కొంత నక్సలైట్ సాహిత్యం వున్నట్లు కనిపెడతాం. వాటికి రికార్డులు అవి వుంటాయి. సిఆర్‌పిసి క్రింద మెమోలు వగైరాలు కూడా స్వాధీనం చేసుకుంటాం" అన్నాడు ఎస్పీ.

రచయితలను నక్సలైట్లుగా, రచనా వ్యాసాంగాన్ని నక్సలైట్ కార్యకలాపంగా చూడడం వరంగల్ అధికార సంస్కృతిలో ఒక భాగమైపోయింది. ఇది దురదృష్టకరం. పోతన జన్మించిన జీవగడ్డపైనే ఇటువంటివి జరగడం మరింత దురదృష్టం. ప్రధాని పి.వి. నరసింహారావు విశ్లేషణ ప్రకారం పోతన ఒక రాజకీయ నిరసన వాది. ఇక ఈ పట్టణం ఎటువంటిదంటే, ఇక్కడ ఒక డాక్టరును (1985), ఒక న్యాయవాదిని (1991 డిసెంబర్) పట్టపగలే పోలీసులు దారుణంగా కాల్చి చంపారు. ఆ రకంగా వారు తాము ఎవరికీ సమాధానం చెప్పనక్కర్లేదని చెప్పకనే చెప్పారు. ఆ క్షణంలో ఇంటరాగేషన్‌కు గురైన ఆ రోగి కళ్ళముందు ఈ చరిత్ర ఒక్కసారి కదలాడింది. భలే మంచి చేప దొరికినందుకు మహిళా పోలీసు అధికారి కళ్ళలో ఉత్సాహం తొంగిచూసింది. సంజీవిని అలాగే చూస్తూ తాను ఎంత గొప్ప ధైర్య సాహసాలు ప్రదర్శించి ఆ చేపను సజీవంగా పట్టుకొచ్చిందో లొట్టలు వేస్తూ నెమరు వేసుకున్నది.

అదే క్షణాన హయగ్రీవాచారి హత్య అనంతరం న్యాయవాది ప్రభాకరరెడ్డి దారుణహత్య - గ్రామీణ తెలంగాణాలో నేలకొరుగుతున్న యువకులు, విలేకరి గులాం రసూల్ కాల్చివేత, అతని స్నేహితుడు విజయ ప్రసాదరావు హత్య, ఖమ్మం జిల్లా మణుగూరులో 13 మంది సామూహిక ఎన్‌కౌంటర్ మొదలైనవన్నీ ఒకదాని తర్వాత ఒకటి సంజీవి కళ్ళముందు కదలాడే ఉంటాయి.

శ్రీమతి ఇందిరాగాంధి హత్యానంతరం రాజకీయ ఆచరణలో ఒక కొత్త వరవడి ప్రారంభమైంది. అయితే రాజ్యం హత్యాకాండ సాగిస్తుంది, లేదంటే ఆ సాగించే వారిని సమర్థిస్తుంది, కాదంటే తాత్కాలికంగా శాంతి భద్రతల పరిరక్షణ కార్యకలాపాలను పక్కనపెట్టి కళ్ళు చెవులు మూసుకుంటుంది. ఇవేవీ కాదంటే శాంతి భద్రతలు పరిరక్షించవలసినవాళ్ళే రాజకీయ కక్ష సాధింపు పాత్రను తమకుతామే భుజాల కెత్తుకొని నిష్పూచీగా హింసాకాండకు పాల్పడతారు. రాజీవ్‌గాంధి హత్యానంతర పరిణామాలను చూస్తే "ఆగ్రహావేశులైన" జనం తమిళులపై విరుచుకుపడ్డారు. తర్వాత అనుమానం కలిగిన ప్రతి ఒక్కరినీ కాల్చిపారేశారు. లేదా వారే ఆత్మహత్య చేసుకోవలసిన అగత్యాన్ని సృష్టించారు. అయితే ఇక్కడ గుర్తించవలసిన ధోరణి ఏమంటే ఒక రాజకీయ వ్యక్తిని నేలకూల్చితే అంతకు పదిరెట్లు ఎదురుదెబ్బతీయడం. ఇది కేవలం మొదటి చర్యకు బాధ్యులుగా అనుమానించినవారికే పరిమితం కాదు. ఇది ఒక్కొకప్పుడు ఊచకోతలకు కూడా దారితీయవచ్చు. అధికారం కోసం పాకులాడే అన్ని రాజకీయపార్టీలను ఈ జాడ్యం పట్టిపీడిస్తున్నట్టే కనిపిస్తున్నది. అసలు ఇంత పెద్ద ఎత్తున హింసాకాండకు పాల్పడడంలో ఔచిత్యం ఉందా, చట్టబద్ధత ఉందా అనికూడా ఎవరూ ప్రశ్నించడం లేదు. అదసలు ఎవరికీ ప్రధాన సమస్యకూడా కావడంలేదు. మన రాష్ట్రంలో కూడ హయగ్రీవాచారి హత్య ఇంతకుముందు చెప్పినటువంటి సందర్భాలలో కనబడినంతటి హింసాకాండని ప్రదర్శించింది. అయితే ఈసారి ఆ పని చేసింది రాష్ట్రశాంతి భద్రతల పరిరక్షణ విభాగం. ఈ హింస లక్ష్యం మనం ఇన్నాళ్ళూ చూస్తున్న పార్లమెంటరీ రాజకీయాలను రక్షించడమే అన్నట్లు పోలీసులు ఆ వ్యూహాన్ని అమలు చేశారు. ఇక్కడ ఒక ఔచిత్యం లేదు ఒక చట్టంలేదు. ఇటువంటి పరిస్థితుల్లో చట్టంగాని రాజ్యాంగంగాని ప్రజాస్వామ్యం గాని న్యాయవ్యవస్థ గాని మనకు న్యాయం అందించే స్థితిలో లేదు. మనది ఎటువంటి సమాజంగా మారిపోయిందంటే పెద్దఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడి ఒకడ్ని ప్రజాప్రతినిధి అని పిలుస్తారు, మద్యపాన నిషేధాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వమే పోలీసు

స్టేషన్ల ద్వారా జనానికి సాగా పోయిస్తుంది, సాంఘిక ఆర్థిక దురన్యాయాల్ని ప్రతిఘటిస్తామని ప్రతివాళ్లూ ప్రతిజ్ఞచేసి మరీ చెప్తారు గానీ అవి అంతకంటే బలంగా సమాజంలో పాతుకుపోతున్నాయి. మన సమాజం ఇంకా ఎలాంటిదంటే బలవంతంగా మనుషుల కళ్ళు పీకుతుంటే సమాజం ఆమోదిస్తుంది; ప్రజలలోని వర్గాలు ఒక రొన్నొకరు దారుణంగా చంపుకుంటారు ఎదురొచ్చినవాళ్ళను నరుకుతారు, అదేమంటే మా ఆడవాళ్ళను ఏడిపించారంటారు. ఇటువంటి సమాజంలో రాజ్యాంగం నిర్వచించిన రాజకీయాలకు, స్వాతంత్రోద్యమ పోరాటానికి ఇక విలువలేదు. ఇటువంటి సమాజం నుంచి, దాని రాజకీయాల నుంచి ఒక కళగాని ఒక పాటగాని బైటికిరాదు. టెలిఫోన్ మోగిన ఆ క్షణంలో సంజీవి మనసును కమ్మేసిన ఆలోచనలు అవే అయి ఉంటాయి.

ఎస్పీ టెలిఫోన్ అందుకొని మాట్లాడాడు. ఆయన మాటల్లో ఎంతసేపూ "ఎస్‌సార్" తప్ప ఇంకేం లేదు. బహుశ ఆ ఫోను చేసిన వ్యక్తి పై పోలీసు అధికారి అయివుంటాడు. బహుశా నిఘా విభాగం ఉన్నతాధికారి అయివుంటాడు. ఎవరైతేనేమి - ఆ మహిళా పోలీసు అధికారి, ఆమె పై అధికారి వరంగల్ నుంచి నడిపించిన ఈ దుస్సాహసిక నిస్సిగ్గు చర్య గురించి విని దిగ్భ్రాంతి చెందే ఉంటారు. అటువంటి చర్యలను ఏ చట్టం, ఏ పాలనా నియమావళి సమర్థించజాలదు. ఈ వార్తను ప్రచురించిన పత్రికలు కూడ దీనికేమి సమాధానం చెప్తారని పాలనా యంత్రాంగాన్ని నిలదీశాయి. దాని ఫలితం వెంటనే కనిపించదు. ఇటువంటి అమానుష చర్యలు చీకట్లు చీల్చుకొని బైటకు వచ్చినట్లు అవి జరిగిన తప్పును సరిదిద్దకపోతే ప్రభుత్వ చట్టబద్ధత, విశ్వసనీయత క్రమంగా ఆవిరైపోతుంది. ఏ సమాజమైనా ఆరోగ్యంగా మనగలగాలంటే పత్రికా స్వాతంత్ర్యం అందుకు కీలకమైన పాత్ర నిర్వహించవలసి ఉంటుంది. బహుశ ఇటువంటి ఆలోచనలే ఆ పై అధికారిచేత ఎస్పీకి ఫోన్ చేయించి ఉంటాయి.

మర్నాడు ఉదయం 11 గంటలకు సంజీవిని అంతకుముందు రాత్రి ఆ ఆసుపత్రిలోని ఏ గదిలో నుంచి తీసుకెళ్ళారో మళ్ళీ అదే గదిలో విడిచిపెట్టారు. ఈ మతిలేని నాటకం 10వ తేదీ రాత్రి 10 గంటలకు, 11వ తేదీ ఉదయం 11 గంటల మధ్య జరిగింది.

ఇది కేవలం మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఇది ప్రభుత్వ పాలనా యంత్రాంగ విధులను, నియమావళిని

పూర్తిగా గాలికి వదిలేసిన సంఘటన. ఇటువంటి ప్రవర్తనని ప్రభుత్వ విధిలో ఒక అనివార్య భాగంగా చట్టంకూడా పేర్కొనదు. ఇది ఒక మతిమాలిన చర్యగా చెప్ప డానికి కూడాలేదు. మీకు తెలుసా— సంజీవిని ఆరాత్రి జీపులో పడేసినప్పుడు వాళ్ళు నక్సలైట్ నినాదాలు చేశారు!! ఇది మామూలు గూండాలు చేసే పని. చాల దారుణ మైంది. కనీసం ఒక్కరంటే ఒక్క పోలీసు అధికారి కూడా తమవాళ్ళు, ఇలా ఎందుకు ప్రవర్తించారో సమాధానం చెప్పుకోలేదు. ముఖ్యమంత్రి నోరు ఎత్తలేదు. హోంమంత్రి నోరు మూసుకున్నాడు. ఈ దుష్ప్రవర్తనకు సూత్రధారుడైన వ్యక్తి ఈ నక్సలైట్లు గాయపడిన తర్వాత ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంటారని, అందువల్లే తాము అలా చేయవలసి వస్తుందని గడుసుగా చెప్పాడు.

నక్సలైట్లు గాయపడి చికిత్సకోసం ఆసుపత్రిలో చేరతారనే అనుకుందాం. కాని ఆసుపత్రిలో చేరిన రోగిని ఇంత బాధ్యతా రహితంగా ఎత్తుకుపోవడానికి ఏ చట్టం వారికి అధికారాన్నిస్తున్నది? దీనికి ప్రజలకు ఒక సమాధానం చెప్పుకోవాలని ఆ ఆసుపత్రిలో డాక్టర్లు అనుకోరు. అధికార యంత్రాంగం రాజ్యాన్ని తమ ప్రైవేటు ఆస్తిగా గుప్పెట్లో పెట్టుకునే స్థితికి సమాజం చేరుకుంది. ప్రభుత్వ మనుగడకు గల ప్రయోజనాలు ఆ ప్రభుత్వంలోకి వచ్చినవారి ప్రయోజనాలుగా మారిపోయాయి. నిజమైన ప్రజా ప్రయోజనాలను క్రమబద్ధం చేయడానికి ప్రజలకు వెసులుబాటు కల్పించడానికి ఉద్భవించినా సంస్థల ముందు ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటు న్నాయి. దోపిడీ అధికార యంత్రాంగ స్వభావం లక్షణాల గురించి మార్క్స్ చెప్పిన విషయాలన్నీ పోలీసు వ్యవస్థలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. రాజ్యం ఎలా వుండాలో ఎలా పనిచేయాలో వాళ్ళు చెబుతున్నారు. ఈ వ్యవస్థకు తామే రక్ష కుల మంటున్నారు. వారు సాగిస్తున్న పెత్తనం చాల దారుణంగా, చాల భయాన కంగా మారింది. సంజీవి అపహరణ సంఘటనలో పోలీసులు ప్రదర్శించిన దుస్సా హసం ఆసుపత్రిలో వైద్యసేవల కోసం ఎదురుచూస్తూ మంచంమీద పడుకున్న క్షత గాత్రుడైన వ్యక్తి మస్తిష్కంలో ఎంతటి భయాందోళన కలిగించిందో, ఎంతటి భద్రతారాహిత్య భావానికి గురిచేసిందో అనూహ్యం.

రాజ్యమే తను నిర్వర్తించవలసిన ప్రవర్తనా నియమావళికి నీళ్ళు వదిలేస్తే అందరూ 'ఎవరికివారే యమునాతీరే' అనే దుస్థితి దాపురిస్తుంది. ఏమి చేసినా శిక్ష పడదులే అన్న భరోసాతో ఏలినవారి అడుగులకు మడుగులొత్తేవారు మాత్రమే కాదు అందరు అడేదారిన పోగలరన్న భయాందోళనలకు తావు ఇస్తున్నారు.

మార్క్సిస్ట్ తత్వశాస్త్ర అనువాదకృషిలో
పర్స్పెక్టివ్స్

ఇంతవరకూ తత్వవేత్తలు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు. అసలు విషయం ప్రపంచాన్ని మార్చడం అనంటుంది మార్క్సిజం. ప్రపంచాన్ని వ్యాఖ్యానించాలన్నా, మార్చాలన్నా ముందు దాని అనుపానాలు తెలుసుకోవాలి. ఇందుకు తత్వశాస్త్ర అధ్యయనం ఎంతో దోహదం చేస్తుంది. అటువంటి ఈ తత్వశాస్త్రానికి ఉన్న విశిష్టత ఎలాంటిది? దానికి అటు మతంతోనూ ఇటు సైన్సుతోనూ వున్న సంబంధం ఎలాంటిది ? జీవితానికి తత్వశాస్త్రానికి వున్న లంకె ఏమిటి ? ఇంకా అనేకానేక సమస్యలకి సమాధానం మార్క్సిస్ట్ తత్వశాస్త్రం.దీన్ని వీలైనంత సరళంగా తెలుగులోకి తేవాలని ప్రయత్నిస్తున్నాం. ఈ సిరీస్ మొత్తానికి చలసాని ప్రసాద్ ఎడిటర్‌గా వుంటారు. తత్వశాస్త్ర గ్రంథాలని సరిగా అనువాదం చేయగల వారు, తత్వశాస్త్రంపట్ల అవగాహనకలవారు తమ అనువాద సహకారాన్ని, సూచనలని చలసాని ప్రసాద్‌గారికి అందించండి.

ఆయన చిరునామా : చలసాని ప్రసాద్
ఎడిటర్ - పర్స్పెక్టివ్స్ ఫిలాసఫి సిరీస్
15-LIG-హౌసింగ్‌బోర్డు కాలని, విశాఖపట్నం-530 022.

ఈ తత్వశాస్త్రం సిరీస్‌లో మొదటి ప్రచురణగా హోవార్డు సెల్‌సామ్ రాసిన "తత్వశాస్త్రం అంటే ఏమిటి ?"ని ప్రచురిస్తున్నాం. అనువాదం- చలసాని ప్రసాద్. ప్రస్తుతం అనువాదం జరుగుతున్న రచనలు-

—Human Essence - George Thomson - అనువాదం - త్రిపురనేని మధుసూదనరావు

—Economic and Philosophical Manuscripts of 1844. Marx– అనువాదం - ఎన్. వేణుగోపాల్

—An Introduction to Marxist - David Guest - Philosophy - అనువాదం - అరుణ్

తత్వశాస్త్రం పట్ల అభిమానం, ఆసక్తి వున్నవారందరూ తమ వంతు చేయగల ఆర్థిక, హార్దిక సహకారాలని చలసాని ప్రసాద్‌గారికి అందించండి. విరాళాలు పంపేటపుడు ఫిలాసఫి సిరీస్ కోసం అని స్పష్టంగా పేర్కొనండి.

మీ సహకారంతో మాత్రమే ఈ సిరీస్‌ను పూర్తిచేయగలం.

—పర్స్పెక్టివ్స్

స్వీకారం

* చిరుగుపాతల బరువు బతుకులు - చేనేత సంక్షోభంపై ఒక పరిశీలన, ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం, 58 పేజీలు, ఐదురూపాయలు, ప్రతులకు : డాక్టర్ అబ్దుల్ నూర్ భాషా రీడర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు జిల్లా, 522 510

* పౌరహక్కుల ఉద్యమంపై ఈ దాడులెందుకు ? ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ప్రచురణ, 20 పేజీలు, రెండు రూపాయలు, ప్రతులకు : ఎస్. ఎస్. సి. బోస్, డాక్టర్ రామనాథం ఛాంబర్ ఆఫ్ లా, పెద్దిబొట్లవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520 002

* మేడిన్ ఇండియా, సతీష్‌చందర్, పదిహేను రూపాయలు, జర్నలిస్టుల సామాజిక వేదిక, రాజమండ్రి ప్రచురణ; ప్రతులకు : ఫ్రీప్రెస్ ఫోరం, 17-102, అఫిషియల్స్ కాలనీ, శ్యామలానగర్, రాజమండ్రి.

* ప్రవాహం, కవితా సంకలనం, దర్భశయనం శ్రీనివాసాచార్య, 12 రూపాయలు, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.

* మట్టిగుండె, కథల సంపుటి, పాపినేని శివశంకర్, 15 రూపాయలు, ప్రతులకు : పి. గృహలక్ష్మి, 4-5-29/60, 3వ లైను, విజయనగర్, గుంటూరు.

SṚJANA Telugu Monthly April/May 1992
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజన అడ్రసు మారింది. గమనించండి !

కొత్త అడ్రసు : సృజన
ఫ్లాట్ 3, ఫ్లోర్ 2
లక్ష్మి అపార్ట్‌మెంట్స్
నల్లగొండ చౌరస్తా
మలక్‌పేట
హైదరాబాద్-500 036

SṚJANA, Flat 3, Floor 2, Lakshmi Apartments, Nalgonda X Roads,
Malakpet, Hyderabad-500 036. Rs. 5/-